RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 44 పేజీలు - 08 ఆదివారం 11 జనవరి 2026

## హార్వర్డ్ వర్సిటీ కాన్ఫరెన్స్‌కు కెటిఆర్‌కు ఆహ్వానం

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం అందింది. అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరగబోయే 23వ ఎడిషన్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ప్రసంగించాలని ఆహ్వానం లభించింది. హైదరాబాద్, తెలంగాణపై అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తిని పెంపొందించడంలో కేటీఆర్ కీలక కృషికి గానూ ఈ ఆహ్వానం అందినట్లుగా నిర్వాహకులు తెలిపారు. హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో ఈ కాన్ఫరెన్స్ జరగనుంది. ది ఇండియా వి ఇమాజిన్ అనే థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు భారత్, దక్షిణాసియా దేశాలకు చెందిన విద్యార్థులు, ప్రొఫెసర్లు, వ్యాపారవేత్తలు, పాలసీ మేకర్స్, సాంస్కృతిక రంగ నిపుణులు హాజరుకానున్నారు. గతంలో ఈ సదస్సుల్లో నీతా అంబానీ, నితిన్ గడ్కరీ, జైరాం రమేశ్, అజీమ్ ప్రేమ్‌జీ వంటి ప్రముఖులు హాజరై ప్రసంగించారు. తాజాగా కేటీఆర్‌కు కూడా ఈ కాన్ఫరెన్స్‌లో ప్రసంగించాలని ఆహ్వానం అందడం విశేషం. తెలంగాణను టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా నిలబెట్టడంలో కేటీఆర్ చేసిన కృషికి గుర్తింపుగా ఈ ఆహ్వానం అందిందని నిర్వాహకులు ప్రెస్‌నోట్‌లో తెలిపారు. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లో తొలి రోజు జరగబోయే సదస్సులో పాలన, అభివృద్ధి, పబ్లిక్ పాలసీలపై చర్చ జరగనుంది. ఇక రెండో రోజు హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో బిజినెస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, గ్లోబల్ ఎకానమీ అంశాలపై చర్చ జరగనుంది. రెండో రోజు జరిగే ఈ సమావేశంలోనే కేటీఆర్ ప్రసంగించనున్నారు.



## సోమ్‌నాథ్ చేరుకున్న ప్రధాని మోడీ

- సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్'
సెలబ్రేషన్స్‌లో పాల్గొననున్న మోడీ

**తొలి అక్షరం/అహ్మదాబాద్,జనవరి 10:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లో మూడు రోజుల పర్యటనలో భాగంగా రాజ్‌కోట్‌లోని హీరసర్ విమానాశ్రయానికి శనివారంనాడు చేరుకున్నారు. రాష్ట్ర మంత్రి కుంవర్జీ బావలియా, రాజ్‌కోట్ మేయర్ తదితరులు మిగతా2లో...

## హెచ్-1 వీసా ప్రాసెసింగ్ ఫీజులు పెంపు

అమెరికా విదేశాంగ శాఖ కీలక నిర్ణయం




**తొలి అక్షరం/వాషింగ్టన్,10:** అమెరికా ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులు పెంచినట్లు పౌరసత్వ, వలస సేవల శాఖ తాజాగా వెల్లడించింది. కొత్త రేట్స్ మార్చ్ 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. హెచ్-1బీ, ఎల్-1 సహా మిగతా2లో...

# వైద్యులు సామాజిక బాధ్యత మరవ వద్దు

సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలి

ఫెలోస్ ఇండియా కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10:** ప్రజలు, సమా జంపై వైద్యులు తమ బాధ్యతను ఎప్పటికీ మరచిపోవద్దని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వైద్యులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని.. అయితే, ప్రజల నాడి పట్టుకోవడం మరిచిపోవద్దని సీఎం సూచించారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫెలోస్ ఇండియా కార్యక్రమానికి మిగతా2లో...

## వైద్యులు బిజీగా ఉన్నా...పేదలను విస్మరించరాదు

ఒక్కరోజైనా గ్రామాలకు తరలి సేవలు అందించాలి

రంగరాయ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులతో పవన్



**తొలి అక్షరం/కాకినాడ,జనవరి 10 :** వైద్యులు ఎంత బిజీగా ఉన్నప్పటికీ, కనీసం నెలలో ఒక్క రోజైనా గ్రామీణ, గిరిజన ప్రాంతా లకు వెళ్లి నిరుపేదలకు సేవ అందించాలని వైద్య విద్యార్థులనుద్దేశించి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోరారు. వైద్య వృత్తి కేవలం ఒక ఉద్యోగం కాదని, అది మాన వత్వంతో కూడిన దైవ కార్యమని పవన్ అన్నా రు. పవన్ కల్యాణ్ శనివారం కాకినాడలో రంగ రాయ మెడికల్ కాలేజ్ లో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పూర్వ విద్యార్థులు మిగతా2లో...

## పోలవరం -నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుకు ఆర్థికసాయం

విశాఖపట్నం ఆర్థిక ప్రాంతీయ అభివృద్ధి కేంద్రానికి రూ.5 వేల కోట్లు

ప్రీ బడ్జెట్ బేటీలో ఆర్థికమంత్రిని కోరిన ఎపి ఆర్థిక మంత్రి పయ్యావుల



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి 10 :** రాజధాని అమరావతి నిర్మాణం, నదుల అనుసంధానం, రాయలసీమ ప్రాంతీయ సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. కేంద్ర ప్రీ బ్జడెట్ భేటీలో ఈ మేరకు పలు ప్రతిపాదనలను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు అందజేశారు. విశాఖపట్నం ఆర్థిక ప్రాంతీయ అభివృద్ధి కేంద్రానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలి. నదుల అనుసంధానానికి చేయూత ఇవ్వడంతో పాటు, పోలవరం -నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుకు ఆర్థిక సాయం చేయండని కోరారు. పోలవరం - నల్ల మల సాగర్ ప్రాజెక్టుకు వచ్చే బడ్జెట్‌లోనే నిధులు కేటాయించాలి. రాజస్థాన్‌లో 11 నదులను అనుసంధానం చేసే రూ.40 వేల కోట్ల ప్రాజెక్టును కేంద్రం చేపట్టింది. అదే తరహాలో.. కరవు పీడిత ప్రాంతాలకు మిగతా2లో...

## మహిళా ఐఎఎస్‌పై తప్పుడు కథనాలు తగవు

ఇలాంటి కథనాలతో ఆత్మస్థయిర్యం దెబ్బతీయవద్దు

పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు




## తెలంగాణలోని ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును సత్వరం చేపట్టేలా చూడండి

హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు సహకరించండి

మూసీ రివర్ ఫ్రంట్‌కు ఆర్థిక చేయూతను ఇవ్వండి

ప్రీ బడ్జెట్ సమావేశంలో కేంద్రానికి భట్టి వినతి



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి 10 :** ఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో బడ్జెట్ సన్నాహక సమావేశం కొనసాగుతుంది. ఈ సమావేశంలో తెలంగాణ డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. అంతకుముందుకు ఈ సమావేశంపై డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. రాష్ట్ర అవసరాలు, రాష్ట అంశాలపై సమావేశంలో మిగతా2లో...

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయం

రెండు సంవత్సరాలుగా పట్టణాలను సంక్షోభం నెట్టిన కాంగ్రెస్

నిజామాబాద్, ఖమ్మం జిల్లా నేతలతో కేటీఆర్ సన్నాహక సమావేశం




**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10 :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.రెండు సంవత్సరాలుగా పట్టణాలను సంక్షోభం నెట్టిన కాంగ్రెస్ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతుందన్నారు. రానున్న పురపాలక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెబుతారని.. పట్టణ ప్రాంతాల ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీ పైన తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నా రని కేటీఆర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలకు మిగతా2లో...

## మహిళా అధికారిపై తప్పుడు వార్తలు

వారి కుటుంబాలు ఎంతగా బాధపడతాయో తెలియదా..?

కొడుకు చనిపోవడంతోనే నేను సగం చచ్చిపోయా..?

మీడియా కథనాలపై మంత్రి కోమటిరెడ్డి అసహనం




## మేడారం జాతరలో పక్కాగా వైద్య సౌకర్యం

భక్తులకు తక్షణ సేవలు
అందించేలా ప్రణాళిక
జాతరలో భక్తుల సంఖ్యకు
అనుగుణంగా మెడికల్ క్యాంపులు
వైద్యాధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10 :** మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు శనివారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రూపొందించిన ప్రణాళికను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే లక్షల మంది భక్తులు ముందస్తుగానే జాతరకు వెళు న్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే గద్దెల వద్ద, జంపన్న వాగు సమీపంలో, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద 3 వైద్య శిబిరాలను ప్రారంభించామని అధికారులు మంత్రికి

మిగతా2లో...

# మహిళా అధికారిపై తప్పుడు వార్తలు

తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10 : కొందరు మంత్రులపై ఇటీవల వస్తున్న ఆరోపణల్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. కుటుంబాలను ఇబ్బందిపెట్టేలా రాతలు రాయొద్దని హితవు పలికారు. మహిళా ఐఏఎస్‌పైనా దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. మంత్రి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. మహిళా అధికారులపై పలు మీడియా సంస్థల్లో తప్పుడు కథనాలు ప్రసారం కావడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. మహిళా అధికారులపై చెప్పలేని భాషలో కొన్ని ఛానల్స్, సోషల్ మీడియాలో వార్తలు రాయడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. మహిళా అధికారులను బదిలీ చేసే అధికారం సీఎంకే ఉంటుందని.. జిల్లా మంత్రులకు చెప్పి ముఖ్యమంత్రి బదిలీ చేయరని స్పష్టం చేశారు. ఎంతో కష్టపడితే ఐఏఎస్, ఐపీఎస్ అవుతారని.. అలాంటి వారిపై అభాండాలు వేయొద్దని హితవుపలికారు. మహిళా అధికారులను మానసికంగా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రశంసలు సహజమని.. వాటిని తాము తట్టుకుంటామని.. కానీ ఐఏఎస్ అధికారుల ఫ్యామిలీ ఎలా తట్టుకుంటుందని మంత్రి కోమటి రెడ్డి ప్రశ్నించారు. 'మా మీద వేస్తే మేము, మా కుటుంబసభ్యులు, బంధువులు బాధపడతారు. రాసినవారు మేము చేసినట్లు చూశారా?.. దేవుడు అంటే నాకు నమ్మకం.. నేను తెలిసి ఏ తప్పు చేయను. నా కొడుకు చనిపోయినప్పుడే నేను సగం చనిపోయా. ఇంకా మానసికంగా ఇబ్బంది పెట్టొద్దు. నన్ను అవమానించి ఏం సాధిస్తారు?. నేను తప్పు చేస్తే దేవుడు శిక్షిస్తాడు' అని అన్నారు. ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాలు చేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తప్పుడు వార్తల మీద విచారణ జరిపించాలని మంత్రి కోమటిరెడ్డి కోరారు. సినిమా టికెట్ల రేట్ల పెంపుపై మంత్రి కొమటిరెడ్డి స్పందిస్తూ.. సినిమా ఇండస్ట్రీ గురించి పట్టించుకోవడం మానేసినట్లు తెలిపారు. సినిమా టికెట్ల ధరల పెంపుపై తన దగ్గరకు రావొద్దని చెప్పానని.. దీంతో ఎవరూ తనను కలవడానికి రావడం లేదని చెప్పారు. పుష్ప సినిమా సందర్భంగా ఓ మహిళ చనిపోవడం బాధాకరమన్నారు. అప్పటి నుంచే టికెట్ల రేట్ల పెంపు కోసం తన దగ్గరకు రావొద్దని చెప్పానని ఆయన అన్నారు. నిన్నటి సినిమాకు టికెట్ల ధరల పెంపు, రేపటి సినిమాకూ టికెట్ రేట్లు పెంచిన విషయం తనకు తెలీదని చెప్పారు. టికెట్ల రేట్ల పెంపుపై తాను సంతకం చేయలేదని స్పష్టం చేశారు. ఆ విషయంలో ఏం జరుగుతుందో తెలీదని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు.సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వాహనాలతో రోడ్లపై రద్దీ పెరుగుతోందని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.

బాటిల్ నెక్ ప్లేస్ ఉన్న వద్ద జామ్ ఎక్కువ అవుతోందన్నారు. ఈసారి 12 లక్షల వాహనాలు వెళతాయని అంచనా వేసినట్లు తెలిపారు.

ఈరోజు నుంచి ట్రాఫిక్ జామ్ ఉంటుందని.. రద్దీ ఎక్కువ ఉన్నప్పుడు టోల్ ఛార్జీ లేకుండా గేట్ ఎత్తేయాలని చెప్పామని అన్నారు. ప్రత్యామ్నాయ రూట్స్‌లో ప్రయాణికులు వెళ్లాలని సూచించడం జరిగిందన్నారు. ప్రతీ 20 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్జర్గ÷న్సీ కోసం ఒక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదం జరిగితే అవసరమైతే హెలికాప్టర్‌లో హాస్పిటల్‌కు తరలిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

## వైద్యులు బిజీగా ఉన్నా...పేదలను విస్మరించరాదు

(మొదటి పేజీ తరువాయి)

రూ.10.11కోట్లతో నూతన భవనాన్ని నిర్మించడానికి ముందుకు రావడం ఎంతో అభినందించాల్సిన విషయం అన్నారు. ప్రతి కళాశాల పూర్వ విద్యార్థులు ఇలా ఆలోచిస్తే ఏ కళాశాలా ప్రైవేటు పరం కాదని, యువతలో విశాల దృక్పథం రావాలని ఆకాంక్షించారు డిప్యూటీ సీఎం పవన్. విద్యావంతులు కులమతాలకు అతీతంగా సమాజం గురించి ఆలోచించాలని, ఇరుకు మనస్తత్వాలు అభివృద్ధికి ఆకంటంగా మారుతాయని పవన్ కల్యాణ్ అన్నారు. అరకు ప్రాంతంలో సికిల్ సెల్ అనీమియా బాధితుల కోసం దాతల సహకారంతో బ్లడ్ బ్యాంక్ నిర్మిస్తున్నామని వెల్లడించారు.ఇదే సందర్భంగా రాంకోసలో ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైద్యులతో పవన్ ముఖాముఖి నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరారు. వైద్య నిపుణులు తమ సేవలు విస్తరించాలని సూచించారు. విద్యావంతులు కులమతాలకు అతీతంగా ఆలోచించాలని డిప్యూటీ సీఎం కోరారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఎంతో కృషి చేస్తున్నారంటూ పవన్ ప్రశంసించారు. వైద్యులు మానవతాదృక్పథంతో ప్రజా సేవ చేయాలని సూచించారు. డాక్టర్లు.. ఎంత బిజీగా ఉన్నా నెలలో ఒకసారైనా గిరిజన ప్రాంతాలకు వెళ్లాలన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని గొల్లప్రోలు హౌసింగ్ కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని శనివారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరిశీలించారు. సుద్దగడ్డ కాలువపై నిర్మించిన వంతెన పనుల నాణ్యతను పరిశీలించి.. అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సుద్దగడ్డ కాలువపై పవన్ ఆదేశాలతో రూ.3.05 కోట్ల అంచనా వ్యయంతో రోడ్లు భవనాల శాఖ ఈ వంతెన నిర్మించింది. 2024 సెప్టెంబర్‌లో ఉప ముఖ్యమంత్రి పిఠాపురం పర్యటనలో భాగంగా హౌసింగ్ కాలనీ సందర్శనకు వచ్చిన సందర్భంలో వరద ముంపులో ఉంది. పడవపై వెళ్లి కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలువకు వరద వచ్చిన ప్రతిసారి ముంపునకు గురవుతోందని, రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని హౌసింగ్ కాలనీ వాసులు చెప్పారు. ఆ సందర్భంలో కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆ మేరకు కార్యాచరణ రూపొందించి హామీ నెరవేర్చారు.

## పోలవరం -నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుకు ఆర్థికసాయం

(మొదటి పేజీ తరువాయి)

తాగునీరు, పారిశ్రామిక అవసరాలను తీర్చేందుకు రూ.58,700 కోట్ల ప్రాథమిక అంచనాలతో చేపట్టే... పోలవరం -నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు కేంద్రం తోడ్పాటు అందించాలని పయ్యావుల కేశవ్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.రాష్ట్రానికి అత్యధిక స్థాయిలో రెవెన్యూ గ్రాంటులు మంజూరు చేయాలి. సాస్కి, పూర్వోదయ పథకాల కింద నిధులు కేటాయించాలని అన్నారు. ఏప్రిల్ 1 నుంచి 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమల్లోకి వస్తున్నందున అత్యధిక రెవెన్యూ గ్రాంట్లతో పాటు, భారీ మొత్తంలో పన్నుల పంపిణీ చేయాలి. సాస్కి పథకం కింద రాష్ట్రాల్లో మూల ధన పెట్టుబడులకు ప్రత్యేక సాయం చేయాలన్న కేంద్రం నిర్ణయం శుభ పరిణామం. ఈ పథకం కింద వచ్చే ఏడాది కూడా అధిక కేటాయింపులు కొనసాగించాలి. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, జీవనోపాధి కల్పించే ప్రాజెక్టులకు అనుగుణంగా పూర్వోదయ మార్గదర్శక సూత్రాలను అమలు చేయాలి. వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని అమలు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో సూచించారు.

దీనిలో భాగంగా.. రాయలసీమ హార్టికల్చర్ అభివృద్ధి ప్రణాళికలు అమలు చేయాలి. వచ్చే మూడేళ్లలో రూ.41 వేల కోట్లతో రాయలసీమ ప్రాంతంలో సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు అమలు చేయడం వల్ల అది అంతర్జాతీయ హార్టి కల్చర్ కేంద్రంగా మారుతుందన్నారు. గతేడాది కేంద్రం అందించిన రూ.15 వేల కోట్లతో అమరావతి నిర్మాణం తిరిగి ప్రారంభమైంది. కేంద్ర నిధులకు తోడు.. హడ్కో, నాఫెడ్ ఎజెన్సీల నుంచి లభించే నిధులు రెండో దశలో కూడా అందేందుకు తొడ్పాటు అందించాలి.

## మేడారం జాతరలో పక్కాగా వైద్య సౌకర్యం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున జాతర పరిసరాలలో మరిన్ని మెడికల్ క్యాంపులను ముందస్తుగానే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. తక్షణమే మేడారం వెళ్లి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్‌ను మంత్రి ఆదేశించారు.భక్తులు మేడారం బయలుదేరిన దగ్గరి నుంచి.. అమ్మవార్లను దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు చేరేంత వరకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మేడారం చేరుకునే అన్ని రూట్లలోనూ మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు.÷ాతరలో అత్యవసర వైద్య సేవల కోసం మేడారంలోని టీటీడీ కల్యాణ మండపంలో 50 పడకలతో కూడిన ప్రధాన హాస్పిటల్ (శ్రీ సమ్మక్క సారలమ్మ వైద్యశాల) ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీనికి అదనంగా జంపన్న వాగు, ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద 6 పడకల సామర్థ్యంతో రెండు మినీ హాస్పిటళ్లు, జాతర పరిసరాల్లో 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చే 8 ప్రధాన రూట్లలో, ఎక్కడా వైద్య సేవలకు లోటు రాకూడదని మంత్రి సూచించారు. ఇందుకోసం 42 ఎన్-రూట్ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా హనుమకొండ ? మేడారం రూట్‌లో అత్యధికంగా 9 క్యాంపులు, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే భక్తుల కోసం 6 క్యాంపులు, భద్రాచలం రూట్‌లో 5 క్యాంపులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భారీగా వైద్య సిబ్బందిని మోహరించాలని మంత్రి ఆదేశించారు. పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి మొత్తం 3,199 మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఇందులో 72 మంది స్పెషలిస్టులు, 42 మంది లేడీ డాక్టర్లతో కలిపి 544 మంది వైద్యులు విధుల్లో ఉంటారు. వీరికి తోడుగా 2,150 మంది పారామెడికల్ సిబ్బంది (నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు) షిఫ్టుల వారీగా 24 గంటల పాటు సేవలు అందించనున్నారు. గుండెపోటు, ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో గోల్డెన్ అవర్లో చికిత్స అందించేలా 35 అంబులెన్సులను సిద్ధం చేశామని ధికారులు తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైతే పేషెంట్లను ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు, వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ రెండు హాస్పిటళ్లలో నెల రోజుల పాటు డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. చిన్న పిల్లల మందుల దగ్గరి నుంచి పాముకాటు విరుగుడు ఇంజెక్షన్ల వరకు 248 రకాల మందులు, సర్జికల్ సామాగ్రిని ద్వారా ముందస్తుగానే సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే జనవరి 25వ తేదీ నుంచి అన్ని వైద్య శిబిరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీని సన్నద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం హైదరాబాద్‌లో నిజామాబాద్, ఖమ్మం జిల్లా నేతలతో కేటీఆర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నేతల సమావేశంలో పార్టీ నేతలకు పురపాలక ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాల పైన కేటీఆర్ దిశా నిర్దేశర చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా ఏ పట్టణానికి చెల్లించని ఏకైక ప్రభుత్వంగా చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిపోతుందన్నారు. కాంగ్రెస్ రెండు సంవత్సరాల పాలనలో పట్టణాల్లో పరిపాలన పూర్తిగా పడకేసిందని పారిశుద్ధ్య నుంచి మొదలుకొని ప్రతి అంశంలో పట్టణ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నార న్నారు. గత ప్రభుత్వం కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాలకు మరోసారి శిలాఫలకాలు వేయడం తప్పించి?ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని ఒకటి లేదని కేటీఆర్ అన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులు, రోడ్లు, కమ్యూనిటీ హాల్, మోడల్ మార్కెట్ల వంటి ప్రతి ఒక్క కార్యక్రమానికి నిధులు ఆపివేయడంతో అన్ని కార్యక్రమాలు అర్ధాంతరంగా ఆగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను వ్యవసాయనం గాని సంక్షోభంలోకి నెడుతూ.. మరోవైపు పట్టణాలను పడుకోబెట్టి ఏ ముఖం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడుగుతుందన్నారు. ఈ రెండు సంవత్సరాల్లో ఆయా పట్టణాలకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను? ఇచ్చిన నిధులను వివరించి ఓట్లు అడగాలని కాంగ్రెస్ పార్టీ నేతలకు కేటీఆర్ సవాలు చేశారు.

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పార్టీ తరఫున చేసుకోవాల్సిన ఏర్పాట్లను ప్రజల ముందు ఉంచాల్సిన వివిధ అంశాలను కేటీఆర్ ఈ సందర్భంగా పార్టీ నేతలకు తెలియజేశారు. రెండు జిల్లాలకు సంబంధించిన ప్రతి మున్సిపాలిటీలోని క్షేత్రస్థాయి పరిస్థితులపై క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకాలను, అధికార దుర్వినియో గాన్ని తట్టుకొని మంచి ఫలితాలు సాధించామని.. ఇదే స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లోనూ మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.

## సోమ్‌నాథ్ చేరుకున్న ప్రధాని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని సాదర స్వాగతం పలికారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సోమనాథ్‌కు ప్రధాని బయలుదేరారు. ప్రధాని తన పర్యటనలో ప్రఖ్యాత సోమనాథ్ ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొనున్నారు. అనంతరం 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' సెలబ్రేషన్స్‌లో పాల్గొంటారు.సోమనాథ్ ఆలయంపై 1026లో గజనీ మహ్మద్ దాడి చేసి విధ్వంసం చేశాడు. పలువురు విదేశీ పాలకులు కూడా ఆలయంపై దాడి చేసి దోచుకున్నారు. అప్పట్నించి ఆలయ పునరుద్ధరణ పనులతో సోమనాథ్ ఆలయం తన వైభవాన్ని చాటుకుంటూనే ఉంది. అయితే మొదటిసారి జరిగిన దురాగతానికి వెయ్యేళ్లు పూర్తి అవుతున్న సందర్భాన్ని పురస్కరించి సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ పేరుతో ఏడాదంతా వివిధ కార్యక్రమాలను తలపెట్టారు. ఈనెల 8 నుంచి 11 వరకూ వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా వేలాది మంది సాధువులు ఈ ఉత్సవాల్లో పాల్గొని ఆలయ ఆవరణలో జరిగే 72 గంటల ఓంకార (క్షప) ఉచ్ఛరణ కార్యక్రమంలో పాల్గొనున్నారు. సాయంత్రం ఉత్సవాల్లో భాగంగా డ్రోన్ షో, మంత్ర పఠనం ప్రత్యేక ఆకర్షణలు కానున్నారు.సర్దార్ పటేల్ సారథ్యంలో 1951లో ఆలయ పునర్నిర్మాణం జరిగి భక్తుల సందర్శన కోసం తలుపులు తెరుచుకున్నారు. 2026లో 75వ వసంతానికి చేరుకోవడంతో సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. 'భారతీయ నాగరికత అజేయ సంకల్పం, బలానికి గొప్ప నిదర్శనం సోమనాథ్ ఆలయం పునర్నిర్మాణం. మన ఆధ్యాత్మిక సంప్రదాయానికి శక్తివంతమైన చిహ్నం. సంపూర్ణ విశ్వాసం, ఉత్సుకత, భక్తితో యావద్దేశం స్వాభిమాన్ పర్వ్ ఉత్సవాలను జరుపుకొంటోంది' అని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.సోమనాథ్ ఉత్సవాల్లో భాగంగా జనవరి 11వ తేదీ ఉదయం 9.45 గంటలకు జరిగే శౌర్యయాత్రలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనున్నారు. సోమనాథ్ ఆలయాన్ని శతాబ్దాలుగా కాపాడుకుంటున్న యోధుల సంస్మరణగా ఈ శౌర్యయాత్ర నిర్వహిస్తున్నారు. ధైర్యం, త్యాగం, శౌర్యానికి ప్రతీకలుగా 108 అశ్వాలు ఈ యాత్రలో పాల్గొంటాయి. సాయంత్రం జరిగే ఓంకార మంత్రోచ్ఛరణ కార్యక్రమంలోనూ ప్రధాని పాల్గొంటారు. ఆలయ చరిత్ర, భారతదేశ సమున్నత ఆధ్యాత్మిక విలువలపై జరిగే పబ్లిక్ ప్రోగ్రాంలో ఆయన ప్రసంగిస్తారు.

## హెచ్-1 వీసా ప్రాసెసింగ్ ఫీజులు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

పలు రకాల వీసా దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను వేగవంతం చేసేందుకు అమెరికా ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజును చార్జ్ చేస్తుంటుంది. హెచ్-1బీ లాంటి వీసాల విషయంలో గతంలో 2,805 డాలర్లుగా ఉన్న ప్రీమియం ఫీజు ప్రస్తుతం 2,965కి పెరిగింది. విదేశీ ఉద్యోగుల వీసా దరఖాస్తు పరిశీలనను వేగవంతం చేసేందుకు అమెరికా సంస్థలు ఈ ఫీజును చెల్లిస్తుంటాయి. ఇక ఎఫ్-1, జే-1వంటి వీసాల ప్రీమియం ఫీజు కూడా 1,965 డాలర్ల నుంచి 2,075 డాలర్లకు పెరిగింది. 2023 జూన్ నుంచి 2025 జూన్ మధ్య కాలంలో పెరిగిన ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజును పెంచినట్టు పౌరసత్వ, వలస సేవల శాఖ పేర్కొంది. జాబ్స్ మారే వారు, వీసాలను రెన్యూవల్ చేసుకునే విదేశస్తులపై ఈ పెంపు భారం పడనుంది. ఫీజు పెంపుతో వచ్చే అదనపు నిధులతో తమ కార్యకలాపాలను మరింత సరళతరం చేసేందుకు వినియోగిస్తామని ప్రభుత్వం తెలిపింది. వీసా దరఖాస్తుల బ్యాక్‌లాగ్స్ తగ్గడంతో పాటు వీసా దరఖాస్తుల పరిశీలన ఇతర సేవలు మరింత వేగవంతం అవుతాయని చెప్పింది. వీసా సేవలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ధరలు సరిదిద్దడమే తమ లక్ష్యమని కూడా వెల్లడించింది. వలసల కట్టడికి ఇప్పటికే అమెరికా ప్రభుత్వం వివిధ మార్గాలను అనుసరిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వీసా నిబంధనలు ఉల్లంఘిస్తే చిక్కులు తప్పవని ఇటీవల భారతీయ ఎంబసీ ఎక్స్ వేదికగా హెచ్చరించిన విషయం తెలిసిందే.

## తెలంగాణలోని ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ఆర్థికమంత్రి దృష్టికి తీసుకెళ్తానని? వాటి పై ప్రతిపాదనలు ఇస్తామని అన్నారు. రాష్ట ప్రయోజనాలకు సంబంధించి (విద్య) యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు, వైద్యం ,మౌలిక సదుపాయాలపై సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. తెలంగాణలో నిర్మించే సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, రీజనల్ రింగ్ రోడ్, మూసి ప్రక్షాళన, మెట్రో రైలు , జాతీయ ఉపాధి హామీ పథకం , యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటుకు ఆర్థిక సహకారాన్ని కోరుతామన్నారు.

## వైద్యులు సామాజిక బాధ్యత మరవ వద్దు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుండె జబ్బులను నివారించే మిషన్‌లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రజారోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాలసీలు మెరుగుపరచడానికి వైద్యులతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని.. సూచనలు ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు.. వైద్యులు స్వచ్ఛందంగా సీపీఆర్ నేర్పిస్తే చాలా మంది ప్రాణాలు కాపాడగలరని సీఎం అభిప్రాయపడ్డారు.తాను వైద్యుడిని కాకపోయినప్పటికీ.. సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే డాక్టర్‌నని సీఎం వ్యాఖ్యానించారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం, వైద్యులు కలిసి పనిచేద్దామని సీఎం అన్నారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలని కోరారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్ కేర్ అనుబంధ రంగాల్లో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలోనే అత్యుత్తమంగా తెలంగాణ ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

## మహిళా ఐఏఎస్‌పై తప్పుడు కథనాలు తగవు


- ఇలాంటి కథనాలతో ఆత్మస్థయిర్యం దెబ్బతీయవద్దు
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు

తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 10 : తెలంగాణకు చెందిన మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారమవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని అన్నారు. వాస్తవానికి దూరంగా కథనాలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఎంతో కష్టపడితే తప్ప మంత్రులు ఈ స్థాయికి చేరుకోరని.. అలాంటి వారిపై మీడియా సంస్థలు నిరాధారమైన వార్తలను ప్రచురించడం మానేయాలని విజ్ఞప్తి చేశారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా? అని ప్రశ్నించారు. రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిదని నిలదీశారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం మంచిది కాదని హితవు పలికారు. ఓట్ల కోసం దేవుడిని వాడుకోవడం సరికాదని చెప్పుకొచ్చారు మహేశ్ కుమార్ గౌడ్. 'కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణా యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. మేం రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తాం. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్‌రావు బాధపడుతున్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తాం, పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం స్థానాలు గెలిచాం. కంటోన్‌మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచాం. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలనే తపన ప్రజల్లో కనిపిస్తోందన్నారు. పేర్లు మార్చడం వల్ల ప్రజలకు వచ్చేదేమీ లేదు. పేర్ల మార్పునకు ముందు ఆయా జిల్లాలకు ఏమేం చేశారో చెప్పాలి. ప్రజల దృష్టి మళ్లించేందుకే పేరు మార్పు అంశాన్ని తెరపైకి తెస్తున్నారు' అని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ఇనుగుర్తి రెడ్డి సేవా సంఘం పగ్గాలు బొబ్బిలి మహేందర్ రెడ్డి చేతికి..

- 14వ వార్షిక సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక
- 2026-2028 కాలానికి సేవా కార్యక్రమాలకు నూతన దిశ
- సంఘ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతామని నేతల సంకల్పం






**తొలి అక్షరం/ఇనుగుర్తి జనవరి 10:** ఇనుగుర్తి మండల కేంద్రంలో శనివారం ఇనుగుర్తి రెడ్డి సేవా సంఘం 14వ వార్షిక సమావేశం ఘనంగా నిర్వహించారు. గంజి రామ్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఈ సమావేశంలో సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించారు. నూతన కార్యవర్గ ఎన్నికలకు గంజి జనార్ధన్ రెడ్డి, బొబ్బిలి మల్లారెడ్డి (టీచర్)లను ఎలక్షన్ ఆఫీసర్లుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో 2026--2028 కాలానికి సంబంధించిన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. సంఘ నూతన అధ్యక్షునిగా బొబ్బిలి మహేందర్ రెడ్డిను ఎన్నుకోగా, ఉపాధ్యక్షునిగా కొడకండ్ల నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అనుమాండ్ల యాకుబ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా అనుమాండ్ల క్రిష్ణ రెడ్డి, కోశాధికారిగా పరిపాటి వెంకట రెడ్డి ఎన్నికయ్యారు. సంఘానికి మార్గదర్శకులుగా ముఖ్య సలహాదారులుగా పరిపాటి సంజీవ రెడ్డి, మాడుగుల దేవేందర్ రెడ్డిలను ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా బొబ్బిలి మల్లారెడ్డి (రా/రా ప్రతాప్ రెడ్డి), మాసిరెడ్డి యాకుబ్ రెడ్డి, గంజి తిరుపతి రెడ్డి, పరిపాటి రాజేందర్ రెడ్డిలు కొనసాగనున్నారు. ఆర్థిక పారదర్శకత కోసం ఏర్పాటు చేసిన అడిట్ కమిటీలో కొప్పుల సత్తిరెడ్డి, గంజి వీరేందర్ రెడ్డిలను సభ్యులుగా నియమించారు. సంఘ కార్యక్రమాలను ప్రజల వరకు వేగంగా తీసుకెళ్లేందుకు సోషల్ మీడియా కన్వీనర్‌గా బొబ్బిలి రంజిత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నూతన అధ్యక్షుడు బొబ్బిలి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, సంఘ ఐక్యత, సేవా కార్యక్రమాల విస్తరణ, యువత భాగస్వామ్యంతో ఇనుగుర్తి రెడ్డి సేవా సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. సమావేశంలో సభ్యులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ, సంఘ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# నెల్లికుదురు మండలంలోని గ్రామ వాట్సాప్ గ్రూప్: చర్చలు ఉక్కిరిబిక్కిరి

- గ్రామ సమస్యలు, అభివృద్ధి విషయాలు తెలుసుకోవడానికి ఉపయోగపడే గ్రూప్
- చర్చల్లో కొందరు ఇతరుల అభిప్రాయాలను పట్టించుకోకపోవడం వివాదానికి దారితీస్తుందనే ఆందోళన
- నియంత్రణ కోసం సంబంధిత అధికారుల జోక్యం అవసరం




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 10:** నెల్లికుదురు మండలంలోని ఒక గ్రామంలో వాట్సాప్ గ్రూప్ ప్రస్తుతానికి గ్రామ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు తెలుసుకోవడానికి ప్రధాన వేదికగా ఉపయోగపడుతోంది. సుమారు 450 మందికి పైగా సభ్యులతో, ప్రధానంగా గ్రామ ప్రతినిధులు చర్చల్లో ముందంజనిస్తున్నారు. అయితే, గ్రూప్ ప్రారంభ ఉద్దేశానికి విరుద్ధంగా, కొన్ని చర్చలు వ్యక్తిగత రాజకీయాలకే దారి తీస్తున్నాయి. కొందరు సభ్యుల అభిప్రాయాలను పట్టించుకోకుండా చర్చలు సాగడంవల్ల వివాదం మరింత ప్రగాఢతకు దారితీస్తుందని మిగతా సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సభ్యులు సూచిస్తున్నట్లు, గ్రూప్‌లో చర్చలు క్రమంగా, నిర్మాణాత్మకంగా సాగేందుకు గ్రామ పరిషత్ అధికారి లేదా మండల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. ఈ చర్యల ద్వారా చర్చలు నియంత్రితంగా, నిజమైన అభివృద్ధి అంశాలపై కేంద్రంగా కొనసాగుతాయని ఆశిస్తున్నారు. ప్రజలకు, ప్రతినిధులకు, మరియు బాధ్యత వహించాల్సిన అధికారులకు ఇది స్పష్టత కలిగించే విధంగా, గ్రామాల్లో డిజిటల్ వేదికలను సరైన నియంత్రణ మరియు మార్గదర్శకతతో ఉపయోగించడం అత్యవసరమని ఈ సంఘటన సూచిస్తోంది.

# దశదిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 10:** రామన్నపేట మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన కోయగూర మల్లయ్య గౌడ్ మరణించగా వారి యొక్క దశదినకర్మ కార్యక్రమము వారి ఇంటి వద్ద నిర్వహించగా ఈ కార్యక్రమమునకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై మల్లయ్య గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మాపురం పల్లివాడ గ్రామాల సర్పంచులు పులిపలుపుల సునీత. వీరస్వామి కంభంపాటి శ్రీనివాస్ మాజీ సర్పంచ్ బత్తుల శంకరయ్య జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం యువజన విభాగం మండల అధ్యక్షుడు బత్తుల వెంకన్న ఉప సర్పంచ్ నీల నరసింహ మాజీ ఉపసర్పంచులు గండికోట ఆంజనేయులు బత్తిని మహేష్ గ్రామ శాఖ అధ్యక్షుడు కోయగూరి వెంకటేశం వార్డు మెంబర్లు మారగోని రమేష్ కోయగూరి గణేష్ బజ్జురి నరసింహ నాలిక నరసింహ బద్దం గోపాల్ పొట్ట రవి నాయకులు సోమనబోయిన రవి నాగరాజు శ్రీను దుర్గయ్య ప్రశాంత్ ఆంజనేయులు చంద్రమౌళి యాదగిరి సత్యనారాయణ తదితరులు పాల్గొనడం జరిగింది

# రావిరాల చెరువు కట్టకు కొత్త ఊపిరి... ఆడపడుచుల ఆత్మీయతలో అభివృద్ధి శంకుస్థాపన

- గ్రామ జీవనాడికి శుభారంభం
- యాదవ రెడ్డికి సంప్రదాయ స్వాగతం పలికిన మహిళలు
- సాగునీటి భవిష్యత్తుకు ఆశ వెలిగించిన కార్యక్రమం



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 10:** నెల్లికుదురు మండల కేంద్రంలోని రావిరాల గ్రామంలో చెరువు కట్ట మరమ్మతుల పనులకు శనివారం శుభారంభం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమానికి మహబూబాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదవ రెడ్డి హాజరయ్యారు. గ్రామంలో అడుగుపెట్టిన ఆయనను రావిరాల ఆడపడుచులు ఆత్మీయంగా పలకరించి, సంప్రదాయబద్ధంగా స్వాగతం పలకడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామాభివృద్ధిలో కీలకమైన చెరువు కట్ట మరమ్మతులు ప్రారంభమవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సాగునీటి వనరుల పరిరక్షణతో పాటు రైతుల భవిష్యత్తుకు ఇది దోహదపడుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభివృద్ధి కార్యక్రమానికి తమ మద్దతు ప్రకటించడం గ్రామ ఐక్యతకు నిదర్శనంగా కనిపించింది. ఈ సందర్భంగా యాదవ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని తెలిపారు. చెరువుల పునరుద్ధరణతో రైతాంగానికి భరోసా కలుగుతుందని, రావిరాల గ్రామం సాగు--సంక్షేమంలో ముందడుగు వేయబోతోందని పేర్కొన్నారు.

# ప్రజాపక్షం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన ఎస్ఐ ఎస్ కృష్ణయ్య




**తొలి అక్షరం/మాడుగులపల్లి/ జనవరి 10:** మండల కేంద్రంలో శనివారం ప్రజాపక్షం నూతనంగా-2026 ప్రచురించిన క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్సై ఎస్ కృష్ణయ్య. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘటనలు,ప్రజల సమస్యలు, ప్రభుత్వ కార్యక్రమాలు, రాజకీయలు,విద్య వైద్య వంటి అంశాలను ప్రజలకు చేరవేయడం, ప్రభుత్వ పాలనపై నిఘా ఉంచడం, ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజాపక్షం పత్రికను ప్రజలు ఆదరిస్తున్నారని తెలియజేశారు. ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకొస్తూ సమాజానికి సేవ చేస్తుందని ప్రశంసించారు. నూతన సంవత్సరంలో మీడియా మరింత బాధ్యతయుతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఏఎస్ఐ పుట్టల వెంకటేశ్వర్లు, జమిందార్ శ్రీనివాస్, చిరుమర్తి సర్పంచ్ కూరెళ్ల నాగమణి వెంకటాచారి,రైటర్ వాంకుడోతు శ్రీనివాస్ పత్రిక విలేకరులు పాల్గొన్నారు.

# లింగగిరి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి జాతరకి పూర్తయిన ఏర్పాట్లు

- బిఆర్‌యస్ నాయకులు ఏడవ వార్డు మెంబర్ సభ్యులు పులి కాంత- రమేష్ గౌడ్



**తొలి అక్షరం/చెన్నారావుపేట జనవరి 10:** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలోని స్థానిక లింగగిరి గ్రామంలో శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి జాతరను నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి లింగగిరి గ్రామసర్పంచ్ మేడం రజిత-కుమార్ పత్రికా ప్రకటనలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా లింగగిరి గ్రామం బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఏడో వార్డు నెంబర్ సభ్యులు పులి కాంత- రమేష్ గౌడ్ లు మాట్లాడుతూ..లింగగిరి శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి జాతర ఏర్పాట్లు అంగరంగ వైభవంగా జరుపుటకు పూర్తి ఏర్పాట్లు చేశారని,భక్తులకు సకల సదుపాయాలను కల్పించారని, జాతరను నిర్వహించే తేదీలను ప్రకటించడం జరిగింది. 14వ తారీకు గోదాదేవి రంగనాథ కళ్యాణము, తో మొదలయ్యి,15 ద్వాదశి మకర సంక్రాంతి నాడు మహాజాతర ప్రత్యేక పూజలతో భక్తులకు స్వామి దర్శనం ఇస్తారని. 16వ తారీకు కనుమ రోజున స్వామివారి ఊరేగింపు శోభాయాత్ర కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. అంతే కాకుండాజాతరకి సంబంధించినటువంటి ఏర్పాట్లను పూర్తిగా చేశామని, చుట్టూ నాలుగు గ్రామాల ప్రజలు శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దర్శనానికి రావడానికి ఏర్పాట్లు పూర్తి అయినాయని పత్రిక ముఖంగా తెలియజేయడం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆశీస్సులు పొందాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

# నల్గొండ జిల్లా దీక్ష శిబిరంలో ఎస్కే చాంద్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు




**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 10:** తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారికి 250 చదరపు గజాల స్థలము 25 వేల రూపాయల పింఛన్ ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఇచ్చిన పిలుపుమేరకు ఉమ్మడి నల్గొండ జిల్లాలో దీక్ష శిబిరం ఏర్పాటు చేయడం జరిగినది ఈ కార్యక్రమానికి రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే చాంద్ హాజరై ఉద్యమకారుల దీక్షకు మద్దతు తెలిపినారు ఈ కార్యక్రమానికి రామన్నపేట మండల అధ్యక్షులు నోముల శంకర్ జిల్లా నాయకులు బొడ్డుపల్లి లింగయ్య మండల నాయకులు గడ్డం యాదగిరి అశోక్ ఎండి ఇమామ్ తదితరులు పాల్గొన్నారు

# కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేసిన పాలకుర్తి ఎమ్మెల్యే




**తొలి అక్షరం/కొడకండ్ల జనవరి 10:** మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో పాలకుర్తి శాసన సభ్యురాలు, శ్రీమతి యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ. 45,05,220/- విలువైన కళ్యాణలక్ష్మిషాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారుల చేతికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. పేద మరియు మధ్యతరగతి కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాల సమయంలో ఎదురయ్యే ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకాలు సామాజిక సమానత్వాన్ని పెంపొందిస్తూ, మహిళల ఆత్మగౌరవాన్ని బలోపేతం చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పూర్తి పారదర్శకతతో అమలు జరుగుతుందని, ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా లబ్ధిదారులకే ఆర్థిక సహాయం చేరుతోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా మండలంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల లాభాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కడప జిల్లా గ్రంథలయ చైర్మన్ ఎన్నికకు కృషి చేసిన ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు

**తొలి అక్షరం/పులివెందుల జనవరి 10:-** శనివారం పులివెందులలోని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి స్వగృహం నందు శాసనమండలి సభ్యులను కలిసి కృతజ్ఞతలు తెలిపిన కడప జిల్లా గ్రంధాలయ చైర్మన్ దాసరి భాను ప్రకాష్. కడప జిల్లా గ్రంథలయ చైర్మన్‌గా విద్యాధరి పాఠశాల అధినేత దాసరి భానుప్రకాష్ ఎన్నికకు విశేషంగా కృషి చేసిన శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ని సన్మానించిన పులివెందుల విద్యాధరి పాఠశాల యాజమాన్యం. ఈ సందర్భంగా భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి గ్రంథలయాల పాత్ర కీలకమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా గ్రంథలయ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు.

## పెరిగిపోతున్న దొంగలు పంట పొలాల్లో ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం..

● కాపర్, ఆయిల్ చోరీ



**తొలి అక్షర/మాడుగుల పల్లి/ జనవరి 10:** రైతుల సాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. వివరాల్లోకెళ్తే మాడుగులపల్లి మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన బోయినపల్లి మురళీధర్ రావు అనే కౌలు రైతు పంట పొలంలోని శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ట్రాన్స్ఫార్మర్‌ను కిందకు పడవేసి, దానిని ధ్వంసం చేశారు. అందులోని వేల రూపాయల విలువైన కాపర్ (రాగి) వైర్ మరియు ఆయిల్‌ను ఎత్తుకెళ్లారని తెలిపారు.కౌలు రైతుల ఆవేదన ఉదయం పొలానికి వెళ్లిన రైతు, ధ్వంసమైన ట్రాన్స్ఫార్మర్‌ను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. కొత్త ట్రాన్స్ఫార్మర్ రావాలంటే నెలల సమయం పడుతుంది అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. **అధికారుల స్పందన** ఈ ఘటనపై మండల విద్యుత్ శాఖ అధికారిని ఏఈ మణిదీప్ వివరణ ఇలా ఉన్నాయి, సంఘటనా స్థలాన్ని పరిశీలించామని, దొంగతనం వల్ల సుమారు 30,000 వేల రూపాయల నష్టం ఉంటుందని అంచనా వేశామని తెలిపారు. వేములపల్లి సంబంధించిన పరిధి కాబట్టి వేములపల్లి పోలీస్ స్టేషన్కు సమాచారం అందించినట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని రైతులందరూ రాత్రి వేళలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానస్పదంగా వ్యక్తులు కనబడితే పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలని కోరారు.

## పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- కుమ్మరి కుంట్ల నాగన్న సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు...




**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 10:** పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరికుంట్ల నాగన్న డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు 3 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని శనివారం మున్సిపాలిటీ ఆఫీసు ఎదుట సి ఐ టీ యు అధ్యర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులకు చాలు చాలని వేతనాలు ఇస్తూ వెట్టి చాకిరి చేయించుకుంటున్నటువంటి ప్రభుత్వాలు అవి కూడా ఇవ్వకుండా మూడు నెలలకి నాలుగు నెలలకి ఒకసారి జీతాలు ఇవ్వడం జరుగుతుంది అందువలన కార్మికుల కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలల ఒకటో తారీకు వచ్చే విధంగా చూడాలని మూడు సంవత్సరాల నుండి కార్మికులకు రావలసినటువంటి బట్టలు సబ్బులు నూనెలు బూట్లు గ్లౌజులు ఇవ్వటం లేదని ఇప్పటికైనా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కనీస వేతన 26,000 ఇవ్వాలని మున్సిపాలిటీ కార్మికులను పర్మిట్ చేయాలని మట్టి ఖర్చుల కింద 50,000 ఇవ్వాలని వీరిని ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని వ్యక్తిగత ఇన్సూరెన్స్ చేయించాలని పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని వీటన్నిటిని తక్షణమే పరిష్కరించాలని లేనియెడల రేపు రాబోయే కాలంలో కార్మికులందరిని సమీకరించి ఆందోళన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో కంపల్లి శ్రీనివాస్ పుచ్చకాయల ఎల్లయ్య చిరంజీవి శ్రీకాంత్ మనోహర్ సైదులు రజిని వెంకన్న రాము కృష్ణ అశోకు నగేష్ పద్మ మంజుల వెంకటేష్ పుష్ప రాజ్ వీరన్న విజయ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లు ఎవ్వరు ఆ ధైర్య పడొద్దు...

● గ్రామల అభివృద్ధికి 10 కోట్ల నిధులు మంజూరు

● మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ స్పష్టం.



**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి10:** సర్పంచ్ ఎన్నికలు పూర్తయిన నెల రోజుల్లోనే గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయడం పల్లెల్లో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నూతన సర్పంచులను ప్రోత్సహించే ఉద్దేశంతో తొలి విడతగా ఈ నిధులను విడుదల చేసినట్లు వెల్లడించారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, పార్టీలకు అతీతంగా ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. త్వరలో అన్ని పంచాయతీలకూ నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. సంక్రాంతి పండుగకు ముందే నిధులు విడుదల కావడం గ్రామాల్లో హర్షాతిరేకాలను తెచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిందే చేస్తుందని, చేసేదే చెప్తుందని పేర్కొన్నారు.ప్రస్తుతం ఈ నిధులతో ఫరూక్‌నగర్, కొత్తూరు, కొందుర్గు, జిల్లేడు చౌదరిగుడా, కేశంపేట, నందిగామ మండలాల్లో అత్యవసర అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కృష్ణారెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, అగునూరు బస్వం, కేకే కృష్ణ, పురుషోత్తం రెడ్డి, రాజు, ముబారక్, ఖదీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పురపాలక ఎన్నికల్లో మహిళలే కీలక పాత్ర వహించాలి

● కాంగ్రెస్ పార్టీలో మహిళా మణులు సత్తా చాటాలి: డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 10:** పురపాలక సంఘం ఎన్నికల్లో మహిళ మణులు తమ సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు వైద్యురాలు భూక్యా ఉమా మురళి నాయక్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు, జిల్లా మహిళా కాంగ్రెస్ ఇంచార్జ్ ఆంగోత్ సుగణ పాల్గొన్నారు... ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డులో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలి అని అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ గెలుపుకు మహిళలు ఒక శక్తి మరి ప్రచారంలో పాల్గొనాలని ప్రతి గడప గడప కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలని అంతేకాకుండా గత పదేళ్ల బిఆర్ఎస్ పార్టీ చేసిన అరాచకాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి నీ వివరించాలని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇస్తే వారి గెలుపు కోసం పనిచేయాలని ఈ సందర్భంగా కోరారు. అంతేకాకుండా జిల్లాలో మహిళా కార్యకర్తలు సభ్యతలు పెద్దమొత్తంలో చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మండలాల మహిళా అధ్యక్షురాల్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న మోపు దెబ్బ జిల్లా అధ్యక్షుని పుట్టినరోజు వేడుకలు

● అధ్యక్షులు కారంగుల సురేష్ గౌడ్ ● పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన తొలిఅక్షరం రిపోర్టర్ కొయ్యడ సుధాకర్ గౌడ్.





**తొలి అక్షరం/నెక్కొండ జనవరి 10:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు కారింగుల సురేష్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు నెక్కొండ బి ఆర్ యస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, అడ్వకేట్ కొమ్ము రమేష్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి తాటిపెల్లి శివకుమార్, మాజీ ఉపసర్పంచ్ దేవనబోయిన వీరభద్రయ్య, మాజీ వార్డ్ సభ్యులు బండారి రమేష్,ఈదునూరి దిలీప్, ఎండీ రఫీ, మూడు శ్రీనివాస్,మూసినా మాధవ్, ఊళ్లేరావు ప్రభాకర్,గోపగాని శ్రీకాంత్,ఎండీ మదర్, రేగుల అశోక్, గంద్రకోటి నరేందర్,కొయ్యడి శ్రీనివాస్, పలుసం నవీన్, పాకాలపాటి రవిబాబు,ఈదునూరి వినయ్,ఈదునూరి అనిల్ ,మార్క వెంకటేష్, ఆకులపెల్లి నరేష్, పోలిశెట్టి రాకేష్, పొట్లపల్లి రాజు,మాతంగి కిషోర్ మరియు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పలపల్లి విఐపి పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

● ముత్యాల ముగ్గులు,భోగిమంటలతో,కనుమ కోలాహలం ● చిన్నారుల సంక్రాంతి ఆటపాటలతో పండగ వాతావరణం ● వీఐపీ పబ్లిక్ స్కూల్ అంగరంగ వైభవంగా సంక్రాంతి వేడుకలు ● అన్నదాత సుఖీభవ!! రైతు బాగుంటే దేశం బాగుంటుంది-విశాల శ్రవణ్ రెడ్డి ● ఇప్పలపల్లి విఐపి పబ్లిక్ స్కూల్ అన్యువల్ డే ప్రోగ్రాంలో పాల్గొన్న కేశంపేట్ మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి





**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 10:** ఇప్పలపల్లి పబ్లిక్ స్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేశంపేట మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యతో పాటు, నైతిక విలువలు, వినయ విధేయతలు కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మారుతున్న విద్యార్థుల మనస్తత్వాలను జాగృతి పరిచే దిశగా సెలబ్రేషన్స్ నిర్వహించామని పాఠశాల యాజమాన్యం తెలిపారు. ఈ క్రమంలో చదువు, ఆటలు, సాంస్కృతిక కళలో విద్యార్థులు సాధించిన విజయాలపై వార్షిక నివేదికను ప్రవేశపెట్టి, ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాల శ్రావణ్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి వైభోగాన్ని కళ్ళకు కట్టినట్టుగా చూపించిన చిన్నారులందరికీ మరియు స్కూల్ యాజమాన్యానికి,ఉపాధ్యాయులకి,స్కూల్ ప్రిన్సిపల్ వెంకటకృష్ణ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొన్న తల్లులలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.అన్నదాత రైతు యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటకృష్ణ,ఉపాధ్యాయులు, సిబ్బంది,విద్యార్థులు, తల్లిదండ్రులు,అతిధులు పాల్గొన్నారు.

## మాంటిస్సోరి హై స్కూల్‌లో ఘనంగా సంక్రాంతి పండుగ వేడుకలు

● పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొత్త మధుకర్ రెడ్డి





**తొలి అక్షరం/నెక్కొండ జనవరి 10:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం లోని మాంటిస్సోరి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కొత్త మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయ సంక్రాంతి, వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులు బోగి మంటలు వెలిగించడం, రంగురంగుల ముగ్గులు వేయడం, పతంగులు ఎగురవేయడం ద్వారా పండుగ వాతావరణాన్ని మరింత ఉల్లాసంగా మార్చారు. హరిదాస్ వేషధారణతో నిర్వహించిన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పతంగులు ఎగురవేస్తూ విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కొత్త మధుకర్ రెడ్డి మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ వంటి సంప్రదాయ వేడుకల ద్వారా భారతీయ సంస్కృతి, ఆచారాల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు తమ మూలాలు, సంప్రదాయాలను తెలుసుకొని వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి ప్రోత్సహించింది. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు డాక్టర్ ఆనంద రావు, తాటిపర్తి అంజన్ రెడ్డి అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మెర బోయిన మల్లయ్య చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించిన నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి





**తొలి అక్షరం/నెక్కొండ జనవరి 10:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పత్తిపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బొమ్మెరబోయిన నగేష్ వారి తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించిన నర్సంపేట శాసన సభ్యులు దొంతి మాధవరెడ్డి, ఆయన తోపాటు నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి,నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణ,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లావుడ్య తిరుమల్,నర్సంపేట కోర్టు ఏజీపీ అడ్వకేట్ బండి శివకుమార్, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, చల్లా పాపిరెడ్డి,కొణిజేటి బిక్షపతి, పత్తిపాక గ్రామ సర్పంచ్ లావుడ్య సామ్య,ఉప సర్పంచ్ ఉసిల్లపాటి రాజు ,బొల్లె బోయిన సురేష్,పసునూటి లక్ష్మీనారాయణ, బోడ ప్రవీణ్,ఎన్ఎస్యుఐ శ్రీకాంత్,రాయపురం అశోక్,లావుడియా మహేందర్ జ్ఞాని తదితరులు పాల్గొన్నారు.

# “రెండేళ్ల నిరీక్షణ.. ఒకే ఒక కొబ్బరికాయ: రాజు కొత్తపల్లి చెరువు కట్ట రాత మార్చిన ఎమ్మెల్యే మురళి నాయక్!”

**ప్రజా వేదనకు అసెంబ్లీ ప్రతిధ్వనిౌ రాజు కొత్తపల్లి చెరువు కట్టకు నూతన జీవం**

**రెండేళ్ల గాయం మాన్పిన నాయకత్వ స్పర్శ**

**గ్రామ సమస్యను ప్రభుత్వ బాధ్యతగా మార్చిన ఎమ్మెల్యే మురళి నాయక్**

**రైతు ఆశకు పునాది.. అభివృద్ధికి దిశ**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 10:** నెల్లికుదురు మండల కేంద్రంలోని రాజు కొత్తపల్లి గ్రామంలో రెండేళ్లుగా తెగిపోయిన చెరువు కట్ట గ్రామ జీవనాన్ని కుదిపేసింది. ఆ బాధను గమనించిన మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ ప్రజా వేదనను రాజకీయ అజెండాగా కాకుండా, ప్రభుత్వ బాధ్యతగా మార్చి, శనివారం ఉదయం 10:30 గంటలకు చెరువు కట్ట పునర్నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి శుభారంభం చేశారు.చెరువు కట్ట తెగిపోయిన రోజు నుంచి గ్రామ ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు తనను లోతుగా కలచివేశాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమస్యను నిర్లక్ష్యం చేయకుండా అసెంబ్లీలో జీరో అవర్‌లో ప్రస్తావించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కారానికి బాట వేసినట్లు తెలిపారు. ప్రజలకు జీవనాధారమైన సాగునీటి వనరుల పరిరక్షణే తన రాజకీయ కర్తవ్యమని స్పష్టంగా చెప్పారు.రాజు కొత్తపల్లి చెరువు కట్ట పునర్నిర్మాణం పూర్తయితే



రైతులకు సాగునీటి భరోసా లభించడంతో పాటు గ్రామానికి దీర్ఘకాలిక భద్రత ఏర్పడుతుందని ఎమ్మెల్యే అన్నారు. మాటలకే పరిమితం కాకుండా, పనుల రూపంలో అభివృద్ధిని చూపిస్తున్న డాక్టర్ మురళి నాయక్ నాయకత్వానికి ఇది స్పష్టమైన నిదర్శనమని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు భూక్య మురళి ఉమా, మహబూబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదవ రెడ్డి, గ్రామ సర్పంచ్ జనార్ధన్ రెడ్డి, ఉప సర్పంచ్ గణేష్, మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ రెడ్డి, సీతారాంపురం సర్పంచ్ భాస్కర్, ఉప సర్పంచ్ నవీన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు భారీగా హాజరై కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం చేశారు.రెండేళ్లుగా గ్రామ గుండెల్లో ఉన్న ఆందోళనకు నేడు ఆశగా మారిన ఈ చెరువు కట్ట పనులు, ప్రజా





సమస్యలను పట్టుదలతో పరిష్కరిస్తే అభివృద్ధి ఎలా ఉంటుందని ఆ అభిప్రాయపడ్డారు.

## దేశబోయిన రామచంద్ర భౌతికాయానికి నివాళులర్పించిన రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు

**తొలి అక్షరం/రాయచోటి జనవరి 10:-** రాయచోటి రూరల్ మండలం శిబ్యాల కస్పాలో దేశబోయిన అశోక్ తండ్రి దేశబోయిన రామచంద్ర అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసి రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు విచ్చేసి భౌతికాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు

**తొలి అక్షరం/హైదరాబాద్ జనవరి 10:-** హైదరాబాద్, బొంతపల్లి లోని అవంతి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో శనివారం సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భారతీయ యోగా గురువు రవి శర్మ అఖిల, కళాశాల చైర్మన్ ముత్యం శెట్టి శ్రీనివాసరావు, కళాశాల ప్రెసిడెంట్ జ్ఞానేశ్వరి, కళాశాల ఎండీ శ్రావణ్ కుమార్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ వేడుకలను ప్రారంభించారు. భోగిమంటలు గంగిరెద్దుల విన్యాసాలు, రంగురంగుల ముగ్గులతో విద్యార్థులు సందడి చేశారు. కళాశాల ఆవరణలో సాంప్రదాయ వస్త్రాలంకరణతో వచ్చిన విద్యార్థినీ విద్యార్థులతో సంక్రాంతి పండగ వాతావరణం నెల్కొంది. కళాశాల హెచ్ఆర్ డైరెక్టర్ జయప్రద, సింగర్స్ ముదిరెడ్డి ఈశ్వర్, ప్రియదర్శిని, ప్రిన్సిపల్స్ శేష తల్ప సాయి, రాజ్ కమల్, పి ఆర్ ఓ శ్రీనివాస్, హెచ్వోడీస్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## “గ్రామ వికాసమే లక్ష్యం.. ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేకు ‘గులాబీ’ గళం!”వినతి పత్రం అందజేత

**రాజులకొత్తపల్లి ఆవేదన ఎమ్మెల్యే చెంతకు...**


**రోడ్డు, ఇల్లు, మహిళల హక్కులపై బీఆర్ఎస్ ఘన విజ్ఞప్తి**

**తెగిపోయిన రహదారితో నిలిచిన గ్రామ జీవనం - హై లెవల్ బ్రిడ్జ్ అత్యవసరం**

**ఇందిరమ్మ రెండో విడతలో పేదలకే న్యాయం చేయాలని డిమాండ్**

**మహిళలకు ఉచిత బస్ సౌకర్యంతో సామాజిక భద్రత కల్పించాలి**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 10:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని రాజులకొత్తపల్లి గ్రామ ప్రజల నిత్యజీవిత సమస్యలు ఈరోజు నేరుగా ఎమ్మెల్యే దృష్టికి చేరాయి. గ్రామానికి వచ్చిన గౌరవ ఎమ్మెల్యేను కలిసి గ్రామ సర్పంచ్ కొండ జనార్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా వినతి పత్రం అందజేశారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజల తరఫున నిలబడి గళం వినిపించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజులకొత్తపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై గ్రామ జీవనరేఖే నిలిచిపోయిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి చేరి రైతుల కష్టాన్ని నీళ్లపాలు చేస్తున్నదని వివరించారు. ఈ దుస్థితికి శాశ్వత పరిష్కారంగా వెంటనే హై లెవల్ బ్రిడ్జ్ నిర్మించాలని గట్టిగా డిమాండ్ చేశారు అలాగే, ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడత అమలులో పార్టీలు, రాజకీయాల జోక్యం లేకుండా నిజమైన నిరుపేద కుటుంబాలకే లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన పేదలు ఇంకా ఇంటి కల నెరవేరని పరిస్థితిలో ఉన్నారని, వారికి న్యాయం జరగాలంటే ప్రభుత్వమే ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని



కోరారు.ఇంకా, రాజులకొత్తపల్లి గ్రామ మహిళలు విద్య, ఉద్యోగాలు, ఆసుపత్రుల అవసరాల కోసం పట్టణాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మహిళల గౌరవం, భద్రతను దృష్టిలో ఉంచుకొని గ్రామ మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని వినతి పత్రంలో స్పష్టంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు చినురి మధుకర్, బీఆర్ఎస్ మండల యువ నాయకులు తుళ్ళ వివేక్, వార్డు సభ్యులు దేగల రమేష్, బీజేపీ నాయకులు బొల్లంపెల్లి విజేందర్, రామచంద్రు, హరికృష్ణ, మహేష్, బీఆర్ఎస్ నాయకులు దేగల వెంకన్న, శీలం నగేష్, గజ్జెల సుందర్, జిలుకర వేణు, వాళ్లబోజు హరీష్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అనంతరాజుపేట పంచాయితీలో కంపచెట్ల తొలగింపు

**- జేసీబీ సాయంతో రాకపోకలకు సౌకర్యం**

**తొలి అక్షరం/రైల్వేకోడూరు జనవరి 10:-** రైల్వే కోడూరు నియోజకవర్గం అనంతరాజుపేట గ్రామ పంచాయితీ పరిధిలోని బీసీ కాలనీ మరియు వడ్డీ పండ్లకు వెళ్లే రహదారిపై రోడ్డు ఇరువైపులా కంపచెట్లు, పిచ్చి మొక్కలు అధికంగా పెరిగి దారిని పూర్తిగా కప్పేయడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న అనంతరాజుపేట సర్పంచ్ కూసెట్టి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ బండారు మల్లికార్జున వెంటనే స్పందించి జేసీబీ సహాయంతో శుభ్రత పనులను చేపట్టారు.రోడ్డుపై పెరిగిపోయిన మొక్కల వల్ల వాహనదారులు, పాదచారులు దారి కనిపించక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిలో, రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లు పూర్తిగా తొలగించి రాకపోకలకు అనుకూలంగా మార్పులు చేశారు. ఈ చర్యతో గ్రామ ప్రజలు, ముఖ్యంగా బీసీ కాలనీ మరియు పరిసర గ్రామాలకు వెళ్లే ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## రత్తి రామ్ తండలో విషాద ఘడియలు.. మానవత్వం చాటిన గ్రామపంచాయతీ సిబ్బంది

- **స్వర్గీయ భుఖ్య రఘు అర్ట్ స్టాక్‌కు పూలమాలలతో ఘన నివాళి**
- **దుఃఖిత కుటుంబానికి ధైర్యం చెప్పిన ప్రజాప్రతినిధులు**
- **దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం హామీ ఇచ్చిన సర్పంచ్ మదన్ లాల్**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 10:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రత్తి రామ్ తండ గ్రామం విషాదంలో మునిగిపోయింది. గ్రామానికి చెందిన భుఖ్య రఘు అర్ట్ స్టాక్ అకాలంగా స్వర్గీయులు కావడంతో తండావాసుల హృదయాలు కలచివేయబడ్డాయి. ఈ దుఃఖ వార్త తెలియగానే నెల్లికుదురు మండలం గ్రామపంచాయతీ సిబ్బంది సంఘటితంగా అక్కడికి చేరుకొని, స్వర్గీయులైన రఘు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా దుఃఖిత కుటుంబాన్ని ఓదార్చిన గ్రామపంచాయతీ సిబ్బంది, దహన సంస్కారాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరాన్ని సెక్రటరీ ఫోన్ ద్వారా సర్పంచ్ మదన్ లాల్ గారికి వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన సర్పంచ్ మదన్ లాల్ గారు మానవత్వంతో ముందుకొచ్చి అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చి కుటుంబానికి అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామపంచాయతీ జిల్లా ఉపాధ్యక్షులు, సీఐటీయూ నాయకులు బొల్లం ఎల్లయ్య, మండల కార్యదర్శి బానోత్ వెంకన్న, రామ్ కోటి, యాకయ్య, మురళి, రేణుక, హెచ్. మల్లయ్య, హెచ్. వెంకన్న, బికెన్, యాకన్నలతో పాటు నెల్లికుదురు మండలం గ్రామపంచాయతీ సిబ్బంది మొత్తం పాల్గొని, కష్ట సమయంలో కలిసి నిలబడటం ఎంత ముఖ్యమో చాటారు.



# వీబీ జీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి




**ప్రజలకు ఉపాధి,పంచాయతీలకు పాలన హక్కులు కల్పించాలి: డిసిసి అధ్యక్షురాలు డా ఉమా మురళి నాయక్**

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 10:** వీబీజీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేసి ప్రజలకు ఉపాధి, పంచాయతీలకు పాలన హక్కుల కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు వైద్యురాలు భూక్యా ఉమా మురళి నాయక్ కేంద్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు.శనివారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అమే మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల ఉపాధి హక్కులను కలరాస్తూ గ్రామపంచాయతీలకు రాజ్యాంగబద్ధంగా లభించిన అధికారలను నిర్వీర్వం చేసింది మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎస్త్రఅతీవస్త్రం స్థానంలో తీసుకొచ్చిన వికసిద్భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ చట్టం ( వీబీజీ రామ్ జీ ) గ్రామీణ ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు పేద ప్రజల పైన ప్రమాదకరమైన విధమైన మార్పుల ను పూర్తిగా తిప్పి కొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.అంతే కాకుండా కేంద్రం ప్రభుత్వం తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాల వల్ల పేద ప్రజలు ఉపాధిని కోల్పోతారని అంతేకాకుండా నిరుద్యోగం తీవ్రంగా పెరుగుతుంది. దినసరి కూలీలకు కనీస వేతనాల కన్నా తక్కువ వేతనాలు చెల్లించి దోపిడి చేస్తారని దీనివల్ల ముఖ్యంగా మహిళలు ఉపాధి అవకాశాలు కోల్పోతారని దళిత, ఆదివాసి, గిరిజనుల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని రానున్న రోజుల్లో గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరిగి గ్రామీణ జీవన



ప్రమాణాలు కూలిపోతాయని అంతే కాకుండా గ్రామంలో నిర్మించే ఆస్తులపైన ప్రజల హక్కులు కోల్పోతారని ప్రజల ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే ఇప్పుడు పనులు గ్రామసభ నిర్ణయం పై కాకుండా ఢిల్లీ నిర్ణయం పై ఆధారపడి ఉంటాయని తాత చట్టంలో గ్రామసభలు పంచాయతీ పనులు వాటిక అయ్యే ఖర్చులను గ్రామ పరిధిలోనే నిర్ణయించేవి కానీ ఇకపై పనులు నిధులను కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది.కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో శాసనసభ్యులు డా భూక్యా మురళి నాయక్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అజ్మీర సురేష్, అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు సాయి, పట్టణ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య ,పట్టణ నాయకులు ,ఖలీల్ , ఎడ్ల రమేష్ ,పద్మం ప్రవీణ్, దిలీప్, పట్టణ ముఖ్య నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి జిల్లా ఎస్పీకి వినతి పత్రం



తొలి అక్షరం/రామన్నపేట జనవరి 10:మున్సిపల్ జడ్పిటిసి ఎంపిటిసి ఎలక్షన్స్ ఉన్నందునపోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్ కి వినతిపత్రం భువనగిరి: జిల్లాలో మున్సిపల్, జడ్పిటిసి, ఎంపిటిసి ఎలక్షన్ల ఉన్నందున పోలీస్ పికెట్ల ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్ ను కోరడం జరిగింది ఎస్సీ ఎస్టీ బీసీ సంఘం నాయకులు రాచకొండ కమిషనరేట్ నుండి యాదాద్రి జిల్లాకు ఎస్పీ హోదా వచ్చిన సందర్భంగా జిల్లా ఎస్పీ కి సన్మానించడం జరిగింది బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, సామాజికవేత్త బట్టు రామచంద్రయ్య , బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండెబోయిన సురేష్, బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, వారు మాట్లాడుతూభువనగిరి జిల్లాలో మున్సిపల్, జడ్పిటిసి, ఎంపిటిసి ఎలక్షన్లు జరగనున్నాయి. ఈ ఎలక్షన్లు శాంతియుతంగా, న్యాయంగా జరిగేలా చేయడానికి మీ పోలీస్ శక్తి అవసరం. కాబట్టి, మున్సిపల్ కేంద్రంలో గ్రామాలలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి శాంతియుతంగా ప్రజాస్వామ్యంగా ఎలక్షన్లు జరపాలని కోరడం జరిగింది పోలీస్ పికెట్ల ఏర్పాటు: భువనగిరి జిల్లా పరిధిలోని మున్సిపల్, జడ్పిటిసి, ఎంపిటిసి ఎలక్షన్ సంబంధిత ప్రాంతాలలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలి. ఇవి 24 గంటల పాటు పనిచేసేలా చూడాలి. ప్రజల భయాందోళన నివారణకై: గ్రామాలలో ప్రజలు భయం లేకుండా, సజావుగా ఎలక్షన్లలో పాల్గొనేలా ప్యాట్రోలింగ్ పెంచి అన్ని చర్యలు తీసుకోవాలి.కుల, రాజకీయ ఆధిపత్య నియంత్రణ: గ్రామాలు, మున్సిపల్ ప్రాంతాలలో కుల, రాజకీయ ఆధిపత్యాలు ఎక్కువగా ఉన్నందున, వాటిని నియంత్రించి ఆధిపత్య రాజకీయాలకు గట్టి అడ్డుకట్ట వేయాలి.స్వేచ్ఛా ఓటు హక్కు: ప్రజలు తమ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని అవరోధాలను తొలగించి, పూర్తి రక్షణ కల్పించాలి. ప్రజాసేవపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు ఎలక్షన్ లో పాల్గొనే విధంగా ధైర్యంని కల్పించాలి నామినేషన్ వెయ్యకుండా కిడ్నాప్లు చేస్తామని బెదిరింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి మందు, డబ్బు పంపిణీ నివారణ: ఎలక్షన్ల సమయంలో ఓట్ల కోసం మందు, డబ్బు పంచే చర్యలకు గట్టి అడ్డుకట్ట వేయాలి. సమాచారం తెలిసిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అగ్రవర్ణ పేదలపై దాడులు జరగకుండ అడ్డుకోవాలి. జిల్లా ఎస్పీని కోరడం జరిగింది ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, సామాజికవేత్త బట్టు రామచంద్రయ్య, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండబోయిన సురేష్, బీసీ యువజన సంఘం ఉమ్మడిజిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, అనిల్, తదితరులు పాల్గొన్నారు

# క్రాంతి హైస్కూల్ చంద్రుగొండలో ఘనంగా ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు

**● పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల నాగేశ్వర్**







తొలి అక్షరం/నెక్కొండ జనవరి 10: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం లోని క్రాంతి హై స్కూల్ చంద్రుగొండ లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ రాముల నాగేశ్వర్, మరియు ప్రైమరీ సెక్షన్ ఇన్చార్జి మాధవి మేడం, రవళి మేడం, శిల్ప మేడం ఆధ్వర్యంలో ముందస్తుగా పాఠశాలలో సంక్రాంతి పండుగ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య బృందం ,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయ సంక్రాంతి వేడుకలను జరుపుకున్నారు. రంగురంగుల ముగ్గులు వేయడం, పతంగులు ఎగురవేయడం ద్వారా పండుగ వాతావరణాన్ని మరింత ఉల్లాసంగా మార్చారు. సంస్కృతి సంప్రదాయానికి అద్దంపట్టే కార్యక్రమాలను నిర్వహించడంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పతంగులు ఎగురవేస్తూ విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా క్రాంతి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీ రాముల నాగేశ్వర్ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ వంటి సంప్రదాయ వేడుకల ద్వారా భారతీయ సంస్కృతి, ఆచారాల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడమే, ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు తమ మూలాలు, సంప్రదాయాలను తెలుసుకొని వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన సూచించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి ప్రోత్సహించింది. కార్యక్రమంలో భాగస్వామ్య అధ్యాపక బృందం ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య కోసం విదేశాలకు వెళ్లిన విద్యార్థులు మృతి

**అమెరికా నుంచి స్వగ్రామానికి వచ్చిన మృత దేహాలు**

**-దు'ఖ సాగరంలో మండల ప్రజలు-భారీ ఎత్తున పోలీస్ బందో బస్తు**



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 10: విద్య కోసం విదేశాలకు వెళ్లిన విద్యార్థులు విగాధ జీవులుగా మారి స్వగ్రామా చేయడంతో గ్రామంలో విషాదం చాయలు అలుముకు న్నాయి. జిల్లాలోని గార్లమండల కేంద్రానికి చెందిన పుల్లఖండం మేఘన రాణి (24), మండల పరిధి ముల్కనూరుకు చెందిన కడియాల భావన (25) లు విద్య కోసం అమెరికా వెళ్ళి, ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందిన విషయం సర్వత్ర తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో.. భావన, మేఘన రాణి మృత దేహాలు మండలానికి చేరుకున్నాయి. సమాచారం తెలుసుకున్న ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య వారి గృహాలకు చేరుకొని మృత దేహాలను సందర్శించి పూల దండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భావన, మేఘన రాణి తల్లిదండ్రుల, బంధువుల రోధనాలు మిన్నంటాయి. మృతులు ఇద్దరు అవివాహితులు అయినందున మండల పరిధి ముల్కనూర్ శివారులో అంత్యక్రియలు నిర్వహించారు. వారి మృతితో మండల ప్రజల రోధనలతో మండలం తడిసి ముద్దైంది. ఎటువంటి అవంచానియ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. పరామర్శించిన వారిలో తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్దలు, తదితరులు ఉన్నారు.

# చైనా మాంజా విక్రయిస్తే జైలుకే..: పట్టణ ఎస్హెచ్ఓ గట్ల మహేందర్ రెడ్డి



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 10: చైనా మాంజా విక్రయిస్తే జేలుకే పంపుతామని పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గట్ల మహేందర్ రెడ్డి హెచ్చరించారు.సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని పర్యావరణానికి, ప్రజల ప్రాణాలకు తీవ్ర ముప్పుగా మారుతున్న నిషేధిత చైనా మాంజా విక్రయాలను అరికట్టేందుకు శనివారం పట్టణ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని పలు దుకాణాలు, గోదాముల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.సంక్రాంతి అంటే పతంగుల పండుగ అయినప్పటికీ, చైనా మాంజా వాడకం వల్ల పక్షులు, జంతువులు మాత్రమే కాకుండా మనుషుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతోందని ఆయన తెలిపారు. చైనా మాంజా పర్యావరణానికి తీవ్ర హానికరమని, అందుకే తెలంగాణ ప్రభుత్వం దీన్ని సంపూర్ణంగా నిషేధించిందని ఆయన గుర్తుచేశారు.నిషేధం ఉన్నప్పటికీ కొందరు వ్యాపారులు దొంగచాటుగా చైనా మాంజాను విక్రయిస్తుండగా, ప్రజలు కూడా అవగాహన లేకుండా కొనుగోలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో ఎవరైనా చైనా మాంజాను విక్రయించినా, గోదాముల్లో నిల్వ చేసినా లేదా అక్రమ రవాణాకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.సంక్రాంతి పండుగను ఆసరాగా చేసుకుని ఇతర రాష్ట్రాల నుంచి రైళ్లు, బస్సులు, ప్రైవేట్ వాహనాల ద్వారా చైనా మాంజాను తరలిస్తున్నట్లు సమాచారం అందిందని, ఆ మార్గాలపై కూడా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు.చైనా మాంజా విక్రయాలు లేదా నిల్వలపై సమాచారం ఉంటే వెంటనే డయల్ 112 లేదా మహబూబాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ నెంబర్ 8712656933కి తెలియజేయాలని ప్రజలను కోరారు.

# చిన్న కొర్పోల్ నుండి పెద్దకొర్పోలు రోడ్డు గుంతలు పూడ్చి మొరం పోసిన చిన్న కొర్పోల్ సర్పంచ్ బానోత్ అనిత- బద్రు నాయక్





తొలిఅక్షరం/నెక్కొండ జనవరి 10: వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చిన్న కోర్పోలు గ్రామం నుండి పెద్ద కొర్పోల్ గ్రామానికి మధ్యల వట్టేవాగు ప్రాంతం నుండి ఊరు మధ్య వరకు ఉన్న గుంతల రోడ్డును మొరంపోసి బాగు చేసి జె సి బి తో చదును చేయిస్తున్న చిన్నకోర్పోల్ గ్రామ సర్పంచ్ బానోత్ అనిత- బద్రు నాయక్, ఏళ్లు గడుస్తున్నా ఊరు బాగోగులు పరిస్థితి అంతంత మాత్రమే ఉంది.ఇటు సూరిపల్లి నుండి చిన్న కోర్పోల్ కి మరియు అటు పెద్ద కొర్పోల్ వట్టె వాగు నుండి చిన్నకోర్పోల్ మధ్యల దారి చాలా అస్తవ్యస్తంగా గుంతల రోడ్డును ఇప్పటి వరకు పట్టించుకునే నాథుడు లేడు, గ్రామస్తులు అభివృద్ధికి నోచుకోకుండా వెనుకబడి ఉండే పరిస్థితిలో ఏకగ్రీవంగా గ్రామ సర్పంచ్ ను నిర్ణయించుకొని గ్రామ అభివృద్ధికి అన్ని పార్టీలకు అతీతంగా పాటుపడుతున్న ఏకైక గ్రామం మండల కేంద్రంలోనే ఒక గ్రామంగా ప్రజలందరూ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల వేణుగోపాల్ గౌడ్, అన్నబోయిన రాజు, కొండపల్లి వెంకటరెడ్డి, తొగరు ఆగమల్లు, బొడ్డుపల్లి యాకయ్య, గంగపురి వరుణ్ సందేశ్ ,గంగపురి సుధాకర్,బిజెపి నాయకులు కొయ్యడ అనిల్ గౌడ్, కొయ్యడ అశోక్, బి ఆర్ఎస్ ఉప సర్పంచ్ తొగరు వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.ం

# బ్లూమ్స్ పబ్లిక్ పాఠశాలలో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

తొలి అక్షరం/వరంగల్ జిల్లా :జనవరి 10: వరంగల్ జిల్లా కేంద్రం లోని కొత్తవాడ బ్ల్యూమ్స్ పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విద్యార్థినులతో పాటు ఉపాధ్యాయినిలకు సైతం శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఆడెపు రాజేందర్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా బీసీ ప్రజా సంఘం మహిళ అధ్యక్షురాలు,25వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు,దుర్గేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త తురాయి రజిని రాహుల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ను ఉద్దేశించి మాట్లాడుతూ.. కనుమరుగవుతున్న తెలుగు సంస్కృతిని పరిరక్షించటమే కాకుండా విద్యార్థుల్లో కళానైపుణ్యతను వెలికితీస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆడెపు రాజేందర్ ఆధ్వర్యంలో చేస్తున్న కృషి గొప్పదని అన్నారు.సంక్రాంతి పండుగ యొక్క విశిష్టతను నేటి తరానికి చాటిచెప్పేలా పాఠశాల యాజమాన్యం ప్రదర్శించిన తీరు అందరినీ ఆకట్టుకుందన్నారు. భోగి,మకర సంక్రాంతి, కనుమ పండుగల ప్రాముఖ్యతను, రైతన్న పడే కష్టాన్ని మరియు ప్రకృతి పట్ల విద్యార్థులు వేసిన ముగ్గులు ఆకట్టు న్నాయి.అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆడెపు రవీందర్, ఉపాధ్యాయులు సరిత, స్వప్న,అఖిల, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు



# రాహూల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి






తొలి అక్షరం/జనగాం జిల్లా జనవరి 10: లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ గారిపై, అలాగే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారిపై అహంకారంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ జనగామా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో కేటిఆర్ కి పిండ ప్రదానం, అనంతరం దిష్టి బొమ్మ దహనం చేసి నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ శ్రేణులు కేటీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఆయన వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని రాహుల్ గాంధీ గారికి మరియు మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కేటీఆర్‌ను ఎక్కడికక్కడ అడ్డుకొని తీవ్ర నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ధరావత్ రాజేష్ నాయక్, జనగామ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి వివిధ మండలాల అధ్యక్షులు, సోషియల్ మీడియా కోఆర్డినేటర్లు మరియు యువజన కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పద్మావతి కాలనీలో గంటల తరబడి రోడ్లపై నీటి ప్రవాహం...

**● ఇబ్బందుల్లో కాలనీవాసులు ప్రజలు ● తక్షణమే చర్యలు చేపట్టాలని వ్యాపారదారులు విజ్ఞప్తి**



తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి10: షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని పద్మావతి కాలనీలో తాగునీరు వృథగా రోడ్లపై ప్రవహిస్తూ ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది.రామకృష్ణ థియేటర్ వెనుకవైపు నుంచి రాఘవేంద్ర ఉడిపి హోటల్ వరకు ఉన్న సీసీ రోడ్డు మీదుగా గంటల తరబడి నీరు ప్రవహించడం నిత్య సమస్యగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ ఇదే పరిస్థితి కొనసాగడంతో రోడ్డు మొత్తం బురదమయంగా మారి, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వ్యాపారస్తులు తమ దుకాణాల ముందు నిలిచిన నీటి వల్ల వినియోగదారులు రాక తగ్గిందని వాపోతున్నారు.ఈ సమస్యపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం కనిపించలేదని కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి పైపుల లీకేజీ కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని అనుమానిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి, నీటి లీకేజీని వెంటనే సరిచేసి రోడ్డు మీదుగా నీరు ప్రవహించకుండా చర్యలు చేపట్టాలని పద్మావతి కాలనీ ప్రజలు కోరుతున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## పద్మశాలీలు అన్ని రంగాల్లో ఎదగాలి

● అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి




**తొలి అక్షరం/హైదరాబాద్, జనవరి 10:-** పద్మశాలీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. అఖిల భారత పద్మశాలి ఇంజనీర్స్ విభాగ్ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య అధ్యక్షతన శనివారం నారాయణగూడ లోని పద్మశాలి భవన్లో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. పద్మశాలీయులు సమాజ సేవకు కొంత సమయం ఇచ్చి సంఘ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. పద్మశాలీలు సంఘటిత శక్తిగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పద్మశాలీలు ఐకమత్యంతో హక్కులు సాధించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అఖిల భారత పద్మశాలి ఇంజనీర్స్ విభాగ్ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పుట్ట పాండురంగయ్య, మసున మోహన్ నారాయణ, చిలుకూరి చంద్రమోహన్, కొక్కుల దేవేందర్, మోతుకూరి కృష్ణ, చింతకింది విజయ ప్రసాద్, ఈడెం సంతోషి, వెంగళ పద్మ, పాల్గొన్నారు.

## లయోలాలో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



**తొలి అక్షరం/పులివెందుల జనవరి 10:-** పులివెందుల పట్టణం లోని లయోలా డిగ్రీ కళాశాలలో నేడు కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ జోజిరెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ వనా, ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫాదర్ ఫిలోమినాన్ రాజు హాజరై విద్యార్థులతో భాగమై సంబరాలు జరిపారు.భోగి మంటలు వేసి,కలశాల ఆవరణం మొత్తం గొబ్బిళ్ళ తో, తోరణాలతో కళాశాలను ముస్తాబు చేసి,జానపద గేయాలతో,ఆట చిందులతో సంప్రదాయాన్ని గుర్తు చేసుకున్నారు.యాజమాన్యం, అధ్యాపక సిబ్బంది , విద్యార్థులు అందరూ కూడా ఐక్యంగా సంబరాలు జరిపారు. కళాశాల సాంస్కృతిక కార్యక్రమాల ఇంచార్జీ శివ , అధ్యాపక,అధ్యకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు(ఆదివారం) ఒడ్డే ఓబన్న జయంతి

- అనంతపురంలో రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం
- హాజరుకానున్న మంత్రి సవిత




**తొలి అక్షరం/అమరావతి జనవరి 10:-** నేడు(ఆదివారం) రేనాటి వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంత్యోత్సవం రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నారు. జయంతి నిర్వహణకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అనంతపురంలో రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. గతేడాదే వడ్డే ఓబన్న జయంతి నిర్వహణకు శాశ్వత జీవో జారీచేసింది. దీనిలో భాగంగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఓబన్న జయంతిని ఆదివారం నిర్వహించనున్నారు. అనంతపురంలో రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవ నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. నగరంలోని సప్తగిరి సర్కిల్ లలిత కళాపరిషత్ లో జరిగే వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమంలో మంత్రి సవిత హాజరుకానున్నారని ఆ ప్రకటనలో మంత్రి కార్యాలయం తెలిపింది.

# రేపల్లెవాడలో ఆకస్మిక విజిలెన్స్ తనిఖీలు

**అక్రమంగా వినియోగిస్తున్నటువంటి 14 కలెక్షన్లు ఉండగా నాలుగు యంపీ ప్లేయర్ డిష్ కనెక్షన్ గుర్తించిన విజిలెన్స్ అధికారులు ?**

**జిల్లా విజిలెన్స్ అధికారికి నివేదిక సమర్పించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుంది**

**తూతూ మంత్రంగా విజిలెన్స్ అధికారుల తనిఖీలు ?**

**కేబుల్ డిష్ కనెక్షన్ యాజమాన్యంపై విజిలెన్స్ అధికారులకు అంత ప్రేమ ఎందుకో మరి**



**తొలి అక్షరం/ఏన్కూర్ జనవరి 11:** ఏన్కూరు మండలంలోని రేపల్లెవాడ గ్రామంలో శనివారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఖమ్మం విజిలెన్స్ ఏడీ రామకృష్ణ నేతృత్వంలో విద్యుత్ శాఖాధికారులతో కలిసి నిర్వహించిన ఈ సోదాల్లో, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న డిష్ కేబుల్స్ నిర్వహణను అధికారులు గుర్తించారు. ప్రధానంగా విద్యుత్ స్తంభాలను అనధికారికంగా వాడుకోవడం, భద్రతా ప్రమాణాలు పాటించకుండా అస్తవ్యస్తంగా వైర్లు ఏర్పాటు చేయడం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ఉల్లంఘనలపై సమగ్ర నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఏడీ రామకృష్ణ తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన బాధ్యులపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.గ్రామస్తుల సమాచారం మేరకు కరెంటు విజిలెన్స్ అధికారులు వచ్చి గ్రామంలో ఉన్నటువంటి స్తంభాలపై ఉన్న అక్రమ కలెక్షన్లను నాలుగు యంపీ ప్లేయర్లను గుర్తించి తొలగించడం జరిగింది అక్రమంగా కలెక్షన్ ఇచ్చినటువంటి డిస్ కలెక్షన్ యాజమాన్యంపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు సమాచారం తెలియ చెప్పలేదు ఇట్టి సమాచారాన్ని ఒక నివేదిక రూపంలో జిల్లా అధికారికి నివేదిక ఇచ్చిన తరువాత ఏన్కూరు మండలం విద్యుత్ శాఖ అధికారికి తెలియజేసి ఇంతకుముందు ఏమైనా ఇటువంటి సమస్యను గుర్తించారా లేదా అనే విషయం తెలుసుకున్న తర్వాత మండల విద్యుత్ శాఖ అధికారి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వచ్చినటువంటి విజిలెన్స్ అధికారులు సమాచారం ఇవ్వడం జరిగింది రేపల్లెవాడ గ్రామస్తులు పై అధికారులకు సమాచారం ఇస్తే నీటి మీద బుడగల పట్టించుకునే నాధుడే కరువయ్యారు మరి డిష్ కలెక్షన్ యాజమాన్యం మీద అంత ప్రేమ ఏంటో అర్థం కాని పరిస్థితిలో గ్రామస్తులు లీగల్ గా కాకుండా ఇల్లీగల్ గా దందా నడుపుతున్న పట్టించుకోని మండల విద్యుత్ శాఖ అధికారులు గ్రామస్తులు డిష్ యజమానిపై ఫిర్యాదు చేశారు తుతు మంత్రంగా విజిలెన్స్ అధికారుల తనిఖీలు ఆ యజమానిని వెంటవేసుకొని తిరిగిన విజిలెన్స్ అధికారులుమండలంలో పలు గ్రామాల్లో. ముడుపులు తీసుకొని కలెక్షన్లు ఇస్తున్నారు అనే ఆరోపణలు మండల వ్యాప్తంగా వినపడుతుందిమరి వీరిపైన జిల్లా అధికారులైన చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి

# మేడారంలో వైద్య సేవల కోసం 3 హాస్పిటళ్లు.. 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు

● జాతరకు వెళ్లే రూట్లలో మరో 42 క్యాంపులు
● 35 అంబులెన్సులు.. 3,199 మంది సిబ్బందితో వైద్య సేవలు ● ఏర్పాట్లపై అధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష



**తొలి అక్షరం/మేడారం,జనవరి 11:** మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ మేరకు శనివారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.జాతర ఏర్పాట్లపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రూపొందించిన ప్రణాళికను మంత్రి పరిశీలించారు.ఇప్పటికే లక్షల మంది భక్తులు ముందస్తుగానే జాతరకు వెళ్తున్న నేపథ్యంలో ఇప్పటికే గద్దెల వద్ద,జంపన్న వాగు సమీపంలో,ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద 3 వైద్య శిబిరాలను ప్రారంభించామని అధికారులు మంత్రికి వివరించారు.భక్తుల సంఖ్య పెరుగుతున్నందున జాతర పరిసరాలలో మరిన్ని మెడికల్ క్యాంపులను ముందస్తుగానే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. భక్తులు మేడారం బయలుదేరిన దగ్గరి నుంచి.. అమ్మవార్లను దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు చేరేంత వరకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మేడారం చేరుకునే అన్ని రూట్లలోనూ మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు.

**50 పడకల ప్రధాన హాస్పిటల్** జాతరలో అత్యవసర వైద్య సేవల కోసం మేడారంలోని టీటీడీ కల్యాణ మండపంలో 50 పడకలతో కూడిన ప్రధాన హాస్పిటల్ (శ్రీ సమ్మక్క సారలమ్మ వైద్యశాల) ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు.దీనికి అదనంగా జంపన్న వాగు,ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద 6 పడకల సామర్థ్యంతో రెండు మినీ హాస్పిటళ్లు,జాతర పరిసరాల్లో 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.**ఎనిమిది రూట్లలో క్యాంపులు** వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చే 8 ప్రధాన రూట్లలో, ఎక్కడా వైద్య సేవలకు లోటు రాకూడదని మంత్రి సూచించారు. ఇందుకోసం 42 ఎన్-రూట్ (జుఅ-తీశీబ్వ) మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా హనుమకొండ - మేడారం రూట్లో అత్యధికంగా 9 క్యాంపులు, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే భక్తుల కోసం 6 క్యాంపులు, భద్రాచలం రూట్లో 5 క్యాంపులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.**3,199 మందితో వైద్య సైన్యం** గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భారీగా వైద్య సిబ్బందిని మోహరించాలని మంత్రి ఆదేశించారు. పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి మొత్తం 3,199 మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఇందులో 72 మంది స్పెషలిస్టులు, 42 మంది లేడీ డాక్టర్లతో కలిపి 544 మంది వైద్యులు విధుల్లో ఉంటారు. వీరికి తోడుగా 2,150 మంది పారామెడికల్ సిబ్బంది (నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు) షిఫ్టుల వారీగా 24 గంటల పాటు సేవలు అందించనున్నారు. **అత్యవసర సేవలకు 35 అంబులెన్సులు** గుండెపోటు,ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో గోల్డెన్ అవర్లో చికిత్స అందించేలా 35 అంబులెన్సులను సిద్ధం చేశామని ధికారులు తెలిపారు.మెరుగైన వైద్యం అవసరమైతే పేషెంట్లను ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు,వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు.ఈ రెండు హాస్పిటళ్లలో నెల రోజుల పాటు డాక్టర్లు,సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.మందుల కొరత రాకుండా చిన్నపిల్లల మందుల దగ్గరి నుంచి పాముకాటు విరుగుడు ఇంజెక్షన్ల వరకు 248 రకాల మందులు,సర్జికల్ సామాగ్రిని ద్వారా ముందస్తుగానే సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు.భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే జనవరి 25వ తేదీ నుంచి అన్ని వైద్య శిబిరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.తక్షణమే మేడారం వెళ్లి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్అబశ్రీశ్రీ నాయక్‌ను మంత్రి ఆదేశించారు.

# పేదల ఉపాధిని నిర్వీర్యం చేసే కుట్ర

**కాంగ్రెస్‌కు పేరు వస్తుందనే ఉపాధి పథకం పేరు మార్పు..**

**మహాత్ముడి పేరు పక్కన పెట్టడంలో ఆంతర్యమేంటో చెప్పాలి..**

**వీబీ- జీ రామ్ జీ బిల్‌తో గ్రామాలకు నష్టం..**

**20వ తేదీ నుంచి కార్యాచరణ షురూ**

**ప్రతీ జీపీలో తీర్మాణం చేసి పార్లమెంట్ లో నిలదీస్తాం..**

**కొత్త స్కీం క్యాన్సల్ అయ్యే వరకూ పోరాడుతాం**

**హన్మకొండ డీసీసీ ప్రెసిడెంట్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**




ఉమ్మడి ఆంధ్రపదేశ్ లో సోనియాగాంధీ పర్యటన సందర్భంగా ఆకలి చావులు చూసి చలించిపోయి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం తీసుకొచ్చారని హన్మకొండ డీసీసీ ప్రెసిడెంట్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తెలిపారు.హన్మకొండ డీసీసీ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఇందులో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు,ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా హన్మకొండ డీసీసీ ప్రెసిడెంట్,కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. దాదాపు 20 ఏళ్లుగా ఈ పథకం కొనసాగుతోందని,కాంగ్రెస్ పేదలకు మంచి జరిగే పథకాలను తీసుకురాగానే వాటిపై కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ విషం కక్కుతోందని, వాటిని నిర్వీర్యం చేసేందుకు ముందుకుసాగుతోందని ఆయన ఆరోపించారు.ఉపాధి హామీ పథకం అంటే కాంగ్రెస్ గుర్తుకు వస్తోందనే కుట్రలో భాగంగానే కేంద్రం 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గర్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్,2025 తీసుకొచ్చిందని మండిపడ్డారు. గాంధీని చంపిన గాడ్సెసే పేరు పెట్టుకొని పథకాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు.గాడ్సెను ముందు పెట్టుకొని దేశాన్ని నడుపుతారా అంటూ ప్రశ్నించారు. స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్మగాంధీ పేరును పక్కకు పెట్టడంలో ఆంతర్యమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతీ గ్రామంలో ఉపాధి హామీ పథకంపై ఆధారపడి అనేక మంది జీవనం సాగిస్తున్నారని, ఇందులో మహిళల సంఖ్యే అని చెప్పారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనార్టీలు వంద రోజుల పనిలో ఉపాధి పొందుతారని తెలిపారు. గతంలో ఉన్న చట్టంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దాదాపు 226 పనులు చేసుకునేందుకు వీలుండేదని, కానీ ఇప్పుడు పైన డిసైడ్ చేసిన పనులే గ్రామాల్లో చేపట్టాల్సి వస్తుందని చెప్పారు. కొత్త చట్టంలో కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చేలా నరేంద్రమోడీ సర్కార్ కుట్రలు చేసిందని ఆరోపించారు. కొత్త పథకం పేదలకు ముప్పుగా వాటిల్లిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు వెచ్చించాలని చెబుతోందని, ఇప్పటికే ఆదాయంలో కేంద్రానికి 30శాతం చెల్లిస్తున్నామని, అదనపు చెల్లింపు రాష్ట్ర ప్రభుత్వానికి భారం కానుందని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పేర్కొన్నారు. కొత్త నిబంధనలతో రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి 1500 కోట్లపైగా భారం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కనీసం సంప్రదించకుండా, పార్లమెంట్ లో మెజార్టీ ఉందని మోడీ సర్కార్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని, గతంలో రైతుల కోసం తెచ్చిన నల్లచట్టాలను రద్దు చేయించినట్లుగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు. **20నుంచి కార్యాచరణ..**20వ తేదీ నుంచి కార్యాచరణ ఉంటుందని పేర్కొన్నారు.మంత్రులు,ఇన్ చార్జ్ ల ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో తీర్మానం చేసి ఎంపీలందరూ పార్లమెంట్ లో సమర్పిస్తారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి 9 జిల్లాలో సమావేశాలు పెట్టనున్నారని, అందులో అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీని తీసుకొచ్చి కేంద్ర ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించే ప్లాన్ చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి ఇస్తున్న పథకాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ కొట్లాడుతుందని చెప్పారు. కర్ణాటకలో హైకోర్టుకు వెళ్లారని, మన వద్ద అసెంబ్లీలో తీర్మాణం చేశారని పేర్కొన్నారు. కొత్త విధానంతో ఇండస్ట్రీస్ కు, బడా కాంట్రాక్టర్లకు లేబర్ ను పంపేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఫైర్ అయ్యారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు,ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు,కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ హైట్స్ పాఠశాలలో ఘనంగా అన్యువల్ డే వేడుకలు

- విద్యా సాంస్కృతిక ప్రతిభకు వేదికగా మారిన వార్షికోత్సవం
- విద్యార్థుల ప్రదర్శనలను అభినందించిన పాఠశాల చైర్మన్ భువనేశ్వర్ ద్రాక్షాయణి
- ముఖ్య అతిథిగా హాజరైన సినీ నటుడు సుమన్, ఫరూక్ నగర్ ఎంఈవో మనోహర్











**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 10:** షాద్‌నగర్ పట్టణంలోని ఇండియన్ హైట్స్ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు విద్యార్థుల ప్రతిభకు అద్దం పట్టాయి. సంవత్సరం పొడవునా వారు సంపాదించిన జ్ఞానం, నైపుణ్యాలను వేదికపై ఆవిష్కరించిన తీరు తల్లిదండ్రులు, అతిథులను ఆకట్టుకుంది. ముఖ్యఅతిగా సినీ నటుడు సుమన్, ఎంఈవో మనోహర్ హాజరై మాట్లాడారు. ఇండియన్ హైట్స్ పాఠశాలలో ఇంత మంచి కార్యక్రమం నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేసిన సినీ నటుడు సుమన్, విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభను మనస్ఫూర్తిగా అభినందించారు. ముఖ్యంగా మాస్టర్ ఆర్ట్స్ విభాగంలో విద్యార్థులు కనబరిచిన నైపుణ్యం అద్భుతంగా ఉపాధ్యాయులు పాత్ర ను కూడా ప్రశంసించారు. విద్యార్థులు స్కిట్ రూపంలో సమాజానికి అందించిన సందేశం ఎంతో ఆలోచింపజేసేదిగా ఉందని, ఇటువంటి కార్యక్రమాలు పిల్లల్లో మానసిక పరిణతి, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అమ్మాయిలు మాస్టర్ ఆర్ట్స్ వైపు మొగ్గ చూపాలని, తమని తాము రక్షించుకునేలా ప్రతి ఒక్కరు ఎదగాలని కోరారు. తాను విద్యార్థిగా ఉన్న రోజుల్లో అనుభవించిన అనేక జ్ఞాపకాలను ఈ సందర్భంగా సుమన్ నెమరు వేసుకున్నారు. అప్పటి రోజుల్ని గుర్తు చేసుకుంటూ, విద్యార్థి దశలోనే మంచి అలవాట్లు, విలువలు అలవరచుకుంటే భవిష్యత్ జీవితం సాఫీగా సాగుతుందని పేర్కొన్నారు. విద్యతో పాటు నైతిక విలువలు, సంస్కృతి సంప్రదాయాలు, క్రమశిక్షణ విద్యార్థుల్లో నాటాల్సిన బాధ్యత పాఠశాలలదేనని చెప్పారు. ఈ దిశగా ఇండియన్ హైట్స్ పాఠశాల చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని ప్రశంసించారు. చివరిగా, విద్యార్థులు మంచి విలువలతో కూడిన విద్యను అలవర్చుకొని, సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షిస్తూ...నేటి విద్యార్థులు దేశాన్ని కాపాడే రక్షకులుగా మారాలని కోరుతూ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ భువనేశ్వర్ ద్రాక్షాయణి మాట్లాడుతూ ...విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కృతి సంప్రదాయాలు, నైతిక విలువలను విద్యార్థుల్లో నాటడమే మా లక్ష్యం. గత ఏడాది వారు నేర్చుకున్న నైపుణ్యాలను నేడు అద్భుతంగా ప్రదర్శించడం అభినందనీయం అని ప్రశంసించారు. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన కరాటే ప్రదర్శనలు అక్కడున్న వారందరినీ మంత్ర ముగ్ధుల్ని చేశాయి. చిన్నారులు ప్రదర్శించిన భగవద్గీత శ్లోకాల గానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతేకాకుండా నృత్యాలు, నాటికలు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా రూపొందించిన ప్రదర్శనలు ప్రేక్షకులను అబ్బుర పరిచాయి. ప్రతి విద్యార్థిలో ఒక కల దాగి ఉంటుందని, ఆ కలను వెలుగులోకి తీసుకువచ్చే చక్కటి వేదిక ఈ అన్యువల్ డే కార్యక్రమమని నిర్వాహకులు పేర్కొన్నారు. విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించేలా ఈ వేడుక ప్రత్యేకంగా నిలిచిందని తల్లిదండ్రులు ప్రశంసించారు. ఇండియన్ హైట్స్ పాఠశాల అన్యువల్ డే వేడుకలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నిదర్శనంగా నిలిచాయని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో విద్యా ప్రమాణాలను పెంపొందిస్తామని యాజమాన్యం తెలిపింది. **21 స్కిల్స్‌తో విద్యకు కొత్త దిశ... కళారూపాల్లో జాతీయ స్ఫూర్తి పాఠశాల** వేదికగా విద్య అంటే కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రమే కాదని మరోసారి నిరూపితమైంది. విద్యార్థుల్లోని 21 కీలక నైపుణ్యాలు (21 స్కిల్స్) ఉట్టిపడేలా రూపొందించిన వినూత్న కార్యక్రమాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. మాతృభూమి, దేశం పట్ల భక్తి, సమాజం పట్ల బాధ్యత అనే మూల సిద్ధాంతాలను హృదయానికి హత్తుకునేలా నాటకాలు, నృత్యాలు, గీతాలు, సంభాషణల రూపంలో విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించారు. ప్రత్యేకమైన స్కిట్ తో ఆధారగొట్టరు. దేశం మనకు ఏమిచ్చింది ? కాదు మనం దేశానికి ఏమిచ్చాం?" అనే భావనతో **విద్యార్థులు అందించిన కళారూప సందేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.** ఈ కార్యక్రమాల ద్వారా ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్‌వర్క్, సమస్యల పరిష్కారం, సృజనాత్మకత, బాధ్యతభావం వంటి 21 కీలక నైపుణ్యాలు విద్యార్థుల్లో సహజంగానే పెంపొందేలా చేయడం విశేషంగా నిలిచింది. విద్యార్థి దశ నుంచే అన్ని సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా, జీవితానికి సిద్ధం చేసే విధంగా ఈ 21 స్కిల్స్ ప్రదర్శన రూపంలో అందించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చింది. పాఠశాల అంటే పరీక్షలకే పరిమితం కాకుండా జీవితానికి పునాది వేసే కేంద్రంగా మారాలనే సందేశాన్ని ఈ కళారూప కార్యక్రమం బలంగా చాటింది. ఎంఈఓ మనోహర్ మాట్లాడుతూ.... విద్యార్థులు అన్ని కోణాలలో తట్టుకునేలా విద్యార్థులను తయారు చేయాలని, విద్యార్థులకు అందుబాటు ఫీజులు నైపుణ్యంగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ హైట్స్ చైర్మెన్ మహేష్, విశ్వేశ్వర్, జగదీశ్వర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

---

# మున్సిపల్ పోరుకు 'కాంగ్రెస్' సన్నద్ధం



- జిల్లాలోని అన్ని పీఠాలూ మనవే కావాలి
- నేతలకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి దిశానిర్దేశం
- పెద్దగోల్కొండలో రంగారెడ్డి జిల్లా ముఖ్య నేతల సమావేశం

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),జనవరి 10:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లాలోని పెద్దగోల్కొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా శాసనసభ్యులు, ముఖ్య నాయకుల కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని తెలిపారు. అన్ని మున్సిపల్ చైర్మన్ పీఠాలను కైవసం చేసుకునేలా ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ విజయానికి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సన్నాహక సమావేశంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, టీపీసీసీ ప్రచార కమిటీ అధ్యక్షులు మధుయాష్కి గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ తీగల అనిత రెడ్డి, చేవెళ్ల ఇన్‌చార్జి భీమ్ భరత్, రాష్ట్ర ప్రతినిధి గౌరి సతీష్ పాల్గొన్నారు.

---

# గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం తప్పదు

- మరోమారు ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్,జనవరి10:** అక్కడి ప్రజలకు నచ్చినా నచ్చకపోయినా.. గ్రీన్‌లాండ్‌ను ఎట్టిపరిస్థితుల్లో స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా ఏ మాత్రం వెనకడుగు వేసినా ఆ ప్రాంతాన్ని రష్యా లేదా చైనా స్వాధీనం చేసుకుంటాయని ఆరోపించారు. రష్యా, చైనా అమెరికాకు పొరుగుదేశాల్లాగా ఉండటం తనకేమాత్రం ఇష్టం లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. చర్చల ద్వారా గ్రీన్‌లాండ్‌ను పొందాలని అనుకున్నాం. కానీ అది సాధ్యం కాలేదు. కాబట్టే కఠిన మార్గాలను అనుసరించాల్సి వస్తోంది. గ్రీన్‌లాండ్ చుట్టూ ఉన్న జలాల్లో ఇప్పటికే చైనా, రష్యా తమ నౌకలను మోహరించి ఉన్నాయి. అమెరికా గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోకపోతే ఆ పనిని చైనా, రష్యాలు చేస్తాయి. అందువల్లే గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి కఠిన మార్గాలను ఎంచుకోవడానికైనా మేం సిద్ధంగా ఉన్నాం. అమెరికాకు గ్రీన్‌లాండ్ వ్యూహాత్మకంగా, రక్షణపరంగా కీలకమైంది. ఆర్కిటిక్ ప్రాంతంలో ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి దానిపై నియంత్రణ అవసరం. దీనిపై మరింత లోతుగా చర్చలు జరపడానికి గ్రీన్‌లాండ్, డెన్మార్క్ నేతలతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భేటి అవుతారు' అని ట్రంప్ వైట్‌హౌస్‌లో మీడియా ముందు వ్యాఖ్యానించారు.

---

# నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం



## ఏపీలోని పలు జిల్లాల్లో వాతావరణంలో మార్పులు

## రెండ్రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం

**అమరావతి,జనవరి10:** నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రస్తుతం బలపడుతూ కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం ప్రభావం వల్ల ఏపీలోని పలు జిల్లాల్లో వాతావరణంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పుకొచ్చారు. వాతావరణ పరిస్థితుల్లో ఏర్పడిన మార్పులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు. వాయుగుండం వల్ల ఏపీలో రెండ్రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ప్రస్తుతం దక్షిణ భారత తీరం వైపు పయనిస్తోందని తెలిపారు. వాయుగుండం ప్రభావం వల్ల ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, శ్రీలంక తీర ప్రాంతాల్లో వాతావరణం వేగంగా మారుతోందని పేర్కొన్నారు. ఈ వాయుగుండం ప్రభావంతో శని, ఆదివారాల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. వాయుగుండం ప్రభావం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతాలు, రాయలసీమ జిల్లాల్లో మేఘావృత వాతావరణం నెలకొంది. ముఖ్యంగా తూర్పు దిశ నుంచి వీస్తున్న గాలుల కారణంగా వర్షపాతం పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం నెల్లూరు, చిత్తూరు, తిరుపతితో పాటు మరికొన్ని జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీవ్ర వాయుగుండం ప్రభావం ఏపీపై పూర్తిగా లేకపోయినా, దాని అనుబంధ ప్రభావంతో కొన్ని జిల్లాల్లో వర్షాలు పడనున్నాయి. ముఖ్యంగా బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లా, రాయలసీమ ప్రాంతంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. రైతులు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ తీవ్ర వాయుగుండం ఉత్తర శ్రీలంకలోని ట్రింకోమలీ జాఫ్నా మధ్య ప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటిన తర్వాత ఇది క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. గంటకు సుమారు 13 నుంచి 15 కిలోమీటర్ల వేగంతో వాయుగుండం వాయువ్య దిశగా కదులుతోందని తెలిపారు. ఈ వాయుగుండం శ్రీలంక తీరాన్ని దాటే సమయంలో ఆకాశం మేఘావృతంగా ఉండడంతో పాటూ బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. సముద్రతీర ప్రాంతాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని.. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు. నైరుతి బంగాళాఖాతంలో సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో ఏపీ తీర ప్రాంతాల మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు సూచించారు. ముఖ్యంగా నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా తీర ప్రాంతాల్లో సముద్రం ప్రమాదకరంగా ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. వర్ష సూచన ఉన్న జిల్లాల్లోని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. కోత దశలో ఉన్న పంటలను రక్షించుకోవాలని పేర్కొన్నారు. నీటి నిల్వలు ఏర్పడకుండా చూడాలని తెలిపారు. పంట పొలాల్లో కాలువలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నష్టాన్ని కలిగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నెల్లూరు, తిరుపతి వంటి పట్టణాల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరాలో స్వల్ప అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని స్థానిక యంత్రాంగం అప్రమత్తంగా ఉందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లవద్దని సూచించారు. వర్షాల కారణంగా ప్రస్తుతం ఉన్న చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. ముఖ్యంగా ఉత్తర కోస్తాలో పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉంటుందని వివరించారు. చలి ప్రభావం దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అన్ని జిల్లాల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించింది. ఈ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని తెలిపారు. అవసరమైతే సహాయక చర్యలు చేపట్టేందుకు రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాబోయే 24 నుంచి 48 గంటల్లో వర్ష తీవ్రత క్రమంగా తగ్గే అవకాశం ఉందని తెలిపారు.